ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY






గురువారం 10 సెప్టెంబర్ 2026 | Thursday 10 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 149 | Vol.No 28 Issue No .149 | www.visionandhra.in


## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిపీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

- ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
- తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన
- మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి
- అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 : తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక "తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి మిగతా 2లో..

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
- ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం
- అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ
- కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని



రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా మిగతా 2లో..

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 09 : రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం–రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. మిగతా 2లో..

## స్టైఫండ్ డబుల్..

- ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్
- స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
- సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్.
- జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ మిగతా 2లో..



## అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

- ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడులు
- దాడులకు ప్రతిదాడులు చేసిన ఇరాన్
- అమెరికా అండర్ వాటర్ డ్రోన్ సీజ్



ఒమన్ గల్ఫ్, సెప్టెంబర్ 09 : అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఐదు ముడి చమురు రవాణా నౌకలపై అమెరికా బలగాలు దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) వెల్లడించింది. మంగళవారం చేపట్టిన ఈ దాడుల్లో నాలుగు నౌకలు పూర్తిగా ధ్వంసమైనట్లు, మరో నౌక దెబ్బతిన్నట్లు తెలిపింది. అమెరికా యుద్ధనౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) 48 గంటల్లో రెండుసార్లు మిగతా 2లో..

## బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

- లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పలువురు మంత్రులు



హైదారాబాద్, సెప్టెంబర్ 09 : లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్?కుమార్? శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్?ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మిగతా 2లో..

## అసెంబ్లీలో ఏలేటి వ్యాఖ్యలపై దుమారం

- ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారపక్షం
- సజావుగా సాగడం ఇష్టంలేదని వ్యాఖ్యలు
- శాసనసభ నుంచి వాకౌట్ చేసిన బీజేపీ
- స్పష్టమైన అజెండా తర్వాతే సభకు..
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదారాబాద్, సెప్టెంబర్ 09 : బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీలో దుమారం రేగింది. సభలోలేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. సభ ఉల్లంఘన జరిగినప్పుడు బీజేపీ మిగతా 2లో..

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

- ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్
- రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు
- సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..
- శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం



హైదారాబాద్, సెప్టెంబర్ 09 : యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, మిగతా 2లో..

## పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

- కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ
- 1000 రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం
- మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు
- గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం: కేటీఆర్



హైదారాబాద్, సెప్టెంబర్ 09 : లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్?ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ మిగతా 2లో..

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్

సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్? అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, మిగతా 2లో..

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్?ఎస్?



# నీరు జీవం అయితే భూమి జీవితం

- మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన
- ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన
- మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్న చంద్రబాబు

పి.గన్నవరం, సెప్టెంబర్ 9 : కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం మాచవరంలో మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరు జీవం అయితే భూమి జీవితం అన్నారు. అందుకే ఈ రెండు కార్యక్రమాలకు



కూటమి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే... రాష్ట్రంపై తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నది నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లింది. ఆ నీటిని వినియోగించు కోగలిగితే మనందరికీ ఎంతో ప్రయోజనం కలిగేది. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా... ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన. అందుకే ప్రతీ నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి వారి బాగోగులు తెలుసుకుంటున్నాను. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన పైనే ప్రధానంగా దృష్టి సారించి పాలన అందిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి తేదీనే పేదల సేవలో పేరిట పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తున్నాను. పీ4తో సామాజిక భాధ్యత కింద వారి జీవన ప్రమాణాలు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. అభివృద్ధి చేయాలి, సంపద సృష్టించాలి. జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మిగతా 2లో..

## పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

## అసెంబ్లీలో ఏలేటి వ్యాఖ్యలపై దుమారం

శాసనసభపక్ష నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అసెంబ్లీలో పేర్కొన్నారు. ఏ నియమ నిబంధనల ప్రకారంగా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. కొత్తగా ఏమైనా పుస్తకం తయారు చేసుకున్నారా ప్రశ్నించారు. గ్రామాల్లో ఏడు గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఏసీలో చెప్పినట్లు సభ నడుపుతారా లేదా రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ పై ఎప్పుడూ చర్చిస్తారో చెప్పే వరకు సభలో మా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. భలో లేనివారిని సస్పెండ్ చేయడం దారుణం. ఇష్టానుసారం సస్పెండ్ చేయడం బాధాకరం. రైతు సమస్యలపై చర్చ ఉంటుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. బీఏసీలో చెప్పిన ప్రకారం సభ నడుపుతారా అని అన్నారు. సభ జిన్నపట్టాన్ని కాపాడేలా మనందరి బాధ్యతన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ స్థానంలో ఉన్న వారి గౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలని హితవు పలికారు. ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న మంత్రి శ్రీధర్‌బాబు సభ కార్యక్రమాలు నిరంతరం అడ్డుకోవడం సమంజసమా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళిత వర్గాలు, బలహీనవర్గాల హక్కులను కాపాడాలని సూచించారు. సామాజిక న్యాయం చేయాలని లేకపోతే ఏమవుతారని ప్రశ్నించారు. విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, 22ఏ సమస్యపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నామని వెల్లడించారు. బీజేపీ సభ్యుల వైఖరి మార్చుకుంటేనే మరింత ఎదుగుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. దళితులను అవమానించినవారిని సమర్థించడం మంచి పద్ధతి కాదని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడితే వారిని మెచ్చుకోవచ్చని పేర్కొన్నారు.సభ సజావుగా జరగడం బీజేపీ సభ్యులకు ఇష్టంలేదన్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభ్యసమాజం తలదించుకునేలా స్పీకర్‌పై ఇష్టానుసారం మాట్లాడతారా అని నిలదీశారు. నిరసన కార్యక్రమం చేస్తుంటే శుద్ధి చేయడం మంచి పద్ధతా? అని ప్రశ్నించారు. ఎర్రవల్లిలో దళితులు కార్యక్రమం చేసిన చోట శుద్ధి చేయడాన్ని ఏమనాలని?, ఖర్గే కూర్చున్న వేదికను ఎందుకు శుద్ధి చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులను డిమాండ్ చేశారు. శాసనసభ నుంచి బీజేపీ వాకౌట్ చేసింది. ప్రభుత్వం అజెండా అంశాలను ముందే ఇవ్వలేదని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. స్పష్టమైన అజెండా ఇచ్చిన తర్వాతే సభ వస్తామని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అర్కోణం - రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణాన్ని మంజూరైన మొత్తంలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘటకేసర్- కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు రైలు మార్గాల కనెక్టివిటీ మెరుగుపడనున్నట్టు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(పూరి/పూరి), సమీపంలోని పురాతన ఆలయాలు), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణా కూడా ఈ ప్రాజెక్టుల ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టుల ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు.

## బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

మంత్రులు గవర్నర్?కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని... దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు... గవర్నర్ శివ్?ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు, తన ఫామ్‌హౌస్ రోడ్డులో దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. బీఆర్ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన శుద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలి. దళితులను అవమానించటం కేసీఆర్ ఆదేశాలతోనే జరుగుతున్నదా?, కేసీఆర్ ఆదేశించకపోతే ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్?ఎస్ నేతల తీరును గవర్నర్?కు వివరించడం కోసమే తాము లోక్? భవన్?కు వెళ్లినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఉదయం బీఆర్?ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్?ను కలిసి అసెంబ్లీలో తొలిరోజు వివాదం, తమ సస్పెన్షన్? గురించి వివరించారు.

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా? నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు.అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం.కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

## అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

బాలిస్టిక్ క్షిపణులతో దాడికి ప్రయత్నించడంతో ప్రతీకార చర్యగా ఈ దాడులు చేపట్టినట్లు సెంట్కామ్ పేర్కొంది. సెంటకామ్ ప్రకటన ప్రకారం, ఒమన్ గల్ఫ్‌లో ఇరాన్‌కు చెందిన నాలుగు ముడి చమురు రవాణా నౌకలు దాడుల్లో ధ్వంసమయ్యాయి. డెర్యా ఖార్గ్ ద్వీపం సమీపంలో దెబ్బతిన్నట్లు అమెరికా సైనిక కమాండ్ తెలిపింది. దాడికి సంబంధించిన దృశ్యాలను కూడా విడుదల చేసింది. ఈ దాడులకు ముందు ఐదు నౌకల్లోని సిబ్బందిని ఖాళీ చేయాలని అమెరికా బలగాలు ప్రత్యక్ష ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. మానవ ప్రాణనష్టాన్ని నివారించేందుకు ముందస్తు హెచ్చరికలు ఇచ్చినట్లు పేర్కొంది. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ నౌకాదళానికి చెందిన ఈ నౌకలు, టెహ్రాన్ భద్రతా వ్యవస్థకు ఆర్థికంగా కీలకమైనవని అమెరికా పేర్కొంది. గత 48 గంటల్లో ఇరాన్? ఒక అమెరికా నావికాదళ యుద్ధనౌకను రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నించిందని యుఎస్? సెంట్రల్? కమాండ్ తెలిపింది. అయితే ఆ రెండు దాడులను అమెరికా యుద్ధనౌక విజయవంతంగా తప్పించుకున్నట్లు వెల్లడించింది. ఈ ఘటనలో అమెరికా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, యుద్ధనౌక కార్యకలాపాలకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించింది. దాడి ప్రయత్నాల తర్వాత కూడా ఆ యుద్ధనౌక ప్రాంతీయ జలాల్లో గస్తీ కొనసాగిస్తోందని పేర్కొంది. సెప్టెంబర్ 5న కూడా ఐఆర్?జీసీ అమెరికా విమాన వాహక నౌక, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్‌పై దాడికి ప్రయత్నించిందని సెంట్కామ్ తెలిపింది. ఆ దాడి ప్రయత్నం విఫలమైన తర్వాత మూడు ఇరాన్ ముడి చమురు రవాణా నౌకలను అమెరికా బలగాలు ధ్వంసం చేశాయని పేర్కొంది. తాజాగా మరో ఐదు నౌకలపై చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. దాడులకు గురైన నౌకలు సాధారణ వాణిజ్య రవాణా వ్యవస్థలో భాగం కాదని అమెరికా సైనిక కమాండ్ ఆరోపించింది. ఇవి ఐఆర్జీసీ, దాని ప్రాంతీయ మిత్ర బలగాలకు నిధులు సమకూర్చే బహుళ బిలియన్ డాలర్ల రహస్య నెట్‌వర్క్‌లో భాగమని పేర్కొంది. ఇరాన్ తన భద్రతా వ్యవస్థను కొనసాగించేందుకు చమురు ఆదాయంపై ఆధారపడుతోందని అమెరికా చెబుతోంది. ఈ నేపథ్యంలో చమురు రవాణా వ్యవస్థను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచే ప్రయత్నంగా తాజా దాడులను పరిశీలిస్తున్నారు. మరోవైపు అమెరికా దాడులకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడులకు ప్రతీకారంగా ఐఆర్?జీసీ సైనిక చర్యలు చేపట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని అమెరికా ఆధీనంలోని అల్ అజ్రాక్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. అమెరికా నావికాదళానికి చెందిన రెండు డిస్ట్రాయర్లను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. ఈ దాడుల్లో ద్రవ, ఘన ఇంధన బాలిస్టిక్ క్షిపణులను ఉపయోగించారని ఆఆర్?జిసి ధ్రువీకరించింది. అమెరికా యుద్ధ విమానాలకు సంబంధించిన హ్యాంగర్లు, రక్షణ షెల్టర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మరో కీలక హెచ్చరిక చేసింది. కువైట్, బహ్రెయిన్ ఓడరేవుల సమీపంలోని చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. పోర్టుల్లో నౌకలు లంగరు వేసి ఉన్నప్పటికీ వాటిపై దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపింది. నౌకల్లో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించింది. అమెరికా బలగాలకు కువైట్, బహ్రెయిన్‌లు ఆశ్రయం కల్పిస్తున్నాయని, తమపై జరిగే దాడులకు సహకరిస్తున్నాయని ఇరాన్ ఆరోపించింది. ఈ హెచ్చరికలతో గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు మరింత పెరిగాయి. ముఖ్యంగా చమురు రవాణాకు కీలకమైన సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ ఇంధన సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో అమెరికాకు చెందిన అండర్‌వాటర్ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది. ఈ పరిణామం కూడా ఇరు దేశాల మధ్య సముద్ర ఉద్రిక్తతలను మరింత పెంచింది.

## నీరు జీవం అయితే భూమి జీవితం

ఈ సందర్భంగా వైసీపీ హయాంలో మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. నాడు జరిగిన ఘటనలను సభలో వివరించిన ముఖ్యమంత్రి జగన్ నైజాన్ని... జగన్ పైమాజీ సీఎం రోశయ్య వ్యాఖ్యలను ప్రస్తావించారు.ఈ అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ పాలకులు మూడేళ్ల క్రితం నన్ను అన్యాయంగా అరెస్టు చేసిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9 తేదీన నన్ను అన్యాయంగా అరెస్టు చేశారు. ఏ తప్పు లేకుండా అరెస్ట్ చేయడం బాధ కలిగించింది. 48 ఏళ్లుగా రాజకీయంలో ఉన్నాను. 31 ఏళ్ల క్రితం తొలిసారి సీఎం అయ్యాను. విలువలతో కూడిన రాజకీయం చేయాలని.. పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. చాలా మంది నాపై ఆరోపణలు చేశారు. కోర్టులకు వెళ్లారు. నాపై చేసిన ఆరోపణల్ని రుజువు చేయలేక పోయారు... అదే నా నిబద్ధత. రాజకీయంపై కుటుంబం ఆధారపడకూడదనే 36 ఏళ్ల క్రితం ఫ్యామిలీ బిజినెస్ ప్రారంభించాం. అప్పట్లో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున కుటుంబ వ్యాపారాన్ని నా సతీమణికి అప్పగించా. నాకు ధన వ్యామోహం లేదు. కేవలం తెలుగు జాతి బాగుండాలనే నేను నిరంతరం ఆలోచన చేస్తా. నంద్యాలలో ఓ సమావేశానికి వెళ్లిన నన్ను అరెస్టు చేస్తామని అర్ధరాత్రి వచ్చారు. నాపై ఆరోపణలు ఏమిటో చెప్పాలని అడిగితే... అరెస్టు చేసిన తర్వాత చెబుతామని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రిని ఉన్న పళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. నా జీవితంలో ఎన్నడూ అనుకోని సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగింది. నేను జైల్లో ఉన్న సమయంలో నాకేం జరుగుతుందోనని తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చింది. హైదరాబాద్ లో కొందరు అడ్డుపడినా టెకీలు కూడా ముందుకు వచ్చి నిరసనలు తెలిపారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా కదలి వచ్చారు. పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారు. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపారు.గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయి. ఈడీ లాంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చింది. గతంలో అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని బలవంతంగా అరెస్టు చేశారు. వేధింపులు చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ వెళ్తే ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కు పంపేశారు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు. కానీ నేను ఆ పని చేయలేదు. చాలా సౌమ్యంగా ఉంటానని, ఏం చేయలేకపోతున్నారని చాలా మంది అనేవారు. కానీ నాకు సహనం ఎక్కువ. నేను చేసే ఏ పని అయినా అది తెలుగు జాతికి న్యాయం జరగాలన్నదే నా లక్ష్యం. మాజీ సీఎం వైఎస్ఆర్ కు ఆయన కొడుకు విషయంలో జాగ్రత్తలు తీసుకోమని ఆనాడే చెప్పాను. గొడ్డలి పార్టీ అధ్యక్షుడ్ని ఆయన తండ్రి వైఎస్ఆర్ చదువుకోడానికి అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడు... ఈ విషయం స్వయంగా వైఎస్సే చెప్పాడు. కొడుకుతో బాధలు భరించలేక అతన్ని వైఎస్సార్ బెంగళూరులోనే ఉంచారని తల్లి విజయమ్మ మాజీ సీఎం రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారు... రోశయ్యే స్వయంగా ఈ విషయం చెప్పారు. ఓ సీఎంగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగుళూరు లాంటి చోట పెట్టాడు అంటే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఎలాంటి వాడో అర్థం చేసుకోండి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన కొడుకును ఎప్పుడూ ఏపీకి రానీయలేదు బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారు. తెల్లవారితే సీఎంగా ఉన్న నాపై నింద వేసి తన పత్రికలో రాయించారు. తన చెల్లి సునీతను కూడా ఏమార్చారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేదా. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారు. అలాంటి వ్యక్తులతో రాజకీయం చేయాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు.

## స్టైఫండ్ డబుల్..

పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. యువతే దేశ భవిష్యత్తు.. విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్దిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. "మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలి తాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురా వడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిం దన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమిం చిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటిక ప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు కూడా ఎరువుల బుకింగ్ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు బుక్ చేసుకునేలా 'మీ-సేవ' బుకింగ్‌లను కూడా అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు లేదా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెస్తోందన్నారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, వ-రూా సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రాబోయే పంట కాలాల్లో రైతుల సంఖ్య పెరిగినా, ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యాప్‌ను వినియోగించినా ఎలాంటి సాంకేతిక అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. యాప్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని, అవసరానికి అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్‌గా పెంచుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ట వినియోగ సమయంలో కూడా రైతులకు సేవలు అం దేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అనం తరం పలువురు సభ్యులు యూరియా రైతులకు అవసరమైన సమయం లో అందుబాటులో ఉండటం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కౌలు రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు, సాంకేతిక ఇబ్బం దుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో యాప్‌ను రద్దు చేయాలని వారు కోరారు.

# సంపాదకీయం

## యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!

రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ - పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సేవాలాల్ సేన 12 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (విజన్ ఆంధ్ర);మహబూబాబాద్ జిల్లా పరిధిలోని శనిగాపురం 9వ వార్డు గుండ్లగూడ తండాలోజిల్లా అధ్యక్షులు గుగులోతు నందులాల్ నాయక్ అధ్యక్షతన సేవాలాల్ సేన 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెండా ఆవిష్కరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సేవాలాల్ వెంకన్న నాయక్ చేశారు. కొబ్బరి కాయ కొట్టి జెండా నూతన గద్దెను ప్రారంభించిన జాతీయ నాయకులు ధరావత్ మోతిలాల్ నాయక్,సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ పిలుపుమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు నూతన జెండా ఆవిష్కరణ గద్దే ప్రారంభించి నేడు ఘనంగా 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగింది. వెంకన్న నాయక్ మాట్లాడుతూసేవాలాల్ సేన తండా పంచాయతీలు, పోడు భూములకు పట్టాలు, తీజ్ పండుగ ,సీతల పండుగ బంజారా సాంప్రదాయాలు కాపాడుకోవాలని అన్నారు. సేవాలాల్




సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల బాలునాయక్ మాట్లాడుతూ ,గిరిజన హక్కులకై,రిజర్వేషన్,సేవాలాల్ మహారాజ్ జయంతి,ఏజెన్సీ సమస్యలపై,ఉద్యోగ సమస్యలపై పోరాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందని,త్వరలో రాష్ట్ర కమిటీ అన్ని జిల్లాల పర్యటనలు చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మాలోతు సురేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబు నాయాక్, అతిథులు మాజీ ఎంపీపీ గూగులోత్ రవి నాయక్,మహిళా సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వాతి బాయి, కళాకారుల సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాను దేవేందర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బానోతు వినోద్ నాయక్, జిల్లా కార్యదర్శి భానోత్ నరేందర్ నాయక్, జిల్లా స్పెషల్ మీడియా ఇన్చార్జి బోడ సుమన్ నాయక్, మండల అధ్యక్షులు డాక్టర్ బోడ రమేష్ నాయక్, టౌన్ ఉపాధ్యక్షులు బోడ దిలీప్ నాయక్ ,ధారావత్ బన్సీలాల్ నాయక్,ధరవత్ రవి కుమార్ నాయక్, రాందాసు నాయక్, వెంకన్న నాయక్ ,శ్రీను నాయక్ ,అనిల్ నాయక్ ,లాలు నాయక్,చంద్రు నాయక్,రమేష్ నాయక్,మంగీలాల్ నాయక్, లక్ష్మీ బాయి, పరోసి బాయి,రంగి బాయి, సరిత బాయి, అమల బాయి,పద్మ బాయి,మల్సూర్ నాయక్,తండా నాయకులు పాల్గొన్నారు.

## బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

భోపాల్, సెప్టెంబర్ 9,మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా - ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.

# పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణ

### జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా ప్రాచీన గ్రంథాల డిజిటలైజ్
### జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమావేశం నిర్వహించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్
### కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్





గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించి, పర్యాటక రంగ అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుంచి పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 142 వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను సమగ్రంగా రూపొందించాలని తెలిపారు.ప్రతి జిల్లాకు మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, అందులో ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి చేయాల్సిన ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, పెట్టుబడి అవకాశాలు, సందర్శకుల సౌకర్యాలు, ప్రచార కార్యక్రమాలను స్పష్టమైన కాల పరిమితులతో పొందుపరచాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టులపై సమగ్ర సర్వే చేపట్టాలని తెలిపారు. ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా తమ పరిధిలో అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టుల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. తెలుగు, ఉర్దూ పండితుల, ఇతర భాషల నిపుణుల వద్ద ఉన్న ప్రాచీన గ్రంథాల వివరాలను సేకరించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ పెట్టుబడిదారులను గుర్తించి, వారితో సమావేశాలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధానం ద్వారా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించాలని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి రూ. 8.45 కోట్ల నిధులతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా వారసత్వ ప్రదేశాలను పర్యాటక ఆకర్షణలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి రామలింగేశ్వర గౌడ్, వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# విద్యార్థి రంజిత్ కుమార్ కుటుంబానికి అండగా రాజు నాయక్



నారాయణపేట సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన విద్యార్థి గత కొన్ని రోజుల క్రితం పాము కాటుకు గురైన విద్యార్థి రంజిత్ కుటుంబాన్ని తెలంగాణ యువ గళం యూట్యూబ్ ఛానల్ అధినేత, సామాజిక సేవకుడు రాజ్ నాయక్ బుధవారం పరామర్శించారు. రంజిత్ ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం తల్లిదండ్రులను ఓదార్చి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రంజిత్ కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు అండగా నిలవాలని రాజ్ నాయక్ డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చే హామీలు కేవలం మౌఖికంగా ఉండకూడదని, రంజిత్ కుటుంబాన్ని ఆదుకునే విషయంలో రాతపూర్వక హామీ ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. మాటలతో కాలయాపన చేయకుండా కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ప్రజల తరఫున ప్రశ్నిస్తూ, అధికారుల్లో చలనం వచ్చేలా త్వరలో కార్యాచరణ చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. రంజిత్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తానని రాజ్ నాయక్ హామీ ఇచ్చారు. అందులో భాగంగా తనవంతుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందరి సమక్షంలో రంజిత్ కుటుంబానికి అందించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తనవంతు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. రంజిత్ కుటుంబం ఒంటరిది కాదు.. న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం. అధికారుల నుంచి రాతపూర్వక హామీ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాం అని రాజ్ నాయక్ స్పష్టం చేశారు. తల్లిదండ్రుల కన్నీళ్లు తుడిచి, వారికి ధైర్యం కల్పిస్తూ.. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, మాజీ రాంరెడ్డి, భోంస్లే అంబాధస్, పల్లి కృష్ణ, జుర్రు ఆనంద్, కే. తిమ్మప్ప, లతోపాటు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా కవి కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్: 09( విజన్ ఆంధ్ర)ప్రజా కవి కాళోజీ నారాయణరావు జీవితం, ఆయన సాహిత్య స్ఫూర్తి, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని నింపారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాన్యుల గొంతుకగా తన సాహిత్యాన్ని మలిచిన కాళోజీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. కాళోజీ ఆలోచనా విధానం, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత కాళోజీ జీవితం, సాహిత్యం, ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా




తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు కేవలం కవిగా మాత్రమే కాకుండా సామాజిక చైతన్యవేత్తగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. ఆయన సాహిత్యం నేటికీ ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తోందని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, డీపీఆర్వో విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మద్యం డిపోలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ,

### సరఫరా, నిల్వలు.. నకిలీ మద్యం నియంత్రణపై అధికారులను ఆరా తీసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ,

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 09 తిమ్మాజీపేట మండల పరిధిలోని తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌బీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధికారిక ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపోను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ బుధవారం సాయంత్రం సందర్శించి నిలువలను పరిశీలించారు. డిపోలో మద్యం నిల్వలు, సరఫరా విధానం, భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. డిపోకు వివిధ ప్రాంతాల నుంచి మద్యం ఏ విధంగా సరఫరా అవుతోంది, ఇక్కడి నుంచి ఏయే జిల్లాలు, ప్రాంతాలకు మద్యం సరఫరా జరుగుతోంది అనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మద్యం సరఫరా వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. అలాగే నకిలీ మద్యం సరఫరాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున, అక్రమ మద్యం తయారీ, రవాణా, సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమానాస్పద కదలికలు, అక్రమ సరఫరా గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డిపోలోని ప్రస్తుతం ఉన్న మద్యం స్టాక్ పాయింట్, నిల్వల పరిమాణం, వివిధ రకాల మద్యం నిల్వలు, రోజువారీ సరఫరా వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు, సరఫరా రికార్డులు తదితరాలను సక్రమంగా నిర్వహించాలని, నిల్వలుసరఫరా వివరాల్లో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. డిపోలో మద్యం నిల్వలు భద్రంగా ఉండేలా అవసరమైన భద్రతా ప్రమాణాలను పాటించాలని, అగ్నిప్రమాదాలు తదితర ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిపోలో 75 వేల బీర్ కాటన్లు, సుమారు 62 వేల లిక్కర్ కాటన్ల మద్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, మహబూబ్ నగర్ షాద్ నగర్ కోస్గి కొడంగల్ ప్రాంతాల మద్యం దుకాణాలకు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్కు అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంటఎక్సైజ్సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ మల్లికార్జున్, స్టోర్ ఆఫీసర్ మధు, తహసీల్దార్ జయంతి, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జ్ఞాన భారత్ మిషన్ కార్యక్రమాన్ని సేకరించిడిజిటలైజ్ చేయడం జరుగుతుంది తిరిగిసేకరించినజనాల్లో పెట్టడం జరుగుతుంది

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 09 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర)భారతదేశంలోని ప్రాచీన, అరుదైన తాళపత్రాలు, చేతిరాత ప్రతులు, పాండులిపులు మరియు ఇతర సాంప్రదాయ జ్ఞాన వనరులనుసంరక్షించడం, డిజిటలైజ్ చేయడం మరియుప్రజలకుఅందుబాటులోకితీసుకురావడం లక్ష్యంగా జ్ఞాన భారత్ మిషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లాలోని ప్రజల వద్ద నుండి ఇలాంటివి వాటిని సేకరించి డిజిటలైజేషన్ చేసి మళ్లీ తిరిగి ఇవ్వడం జరుగుతుందనీ ఎవరి వద్దనైనా ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని జిల్లా అదనపల్లెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్ ఒక ప్రకటన తెలిపారు. జ్ఞాన భారత్మ్ మిషన్ గేమ్ భారత మిషన్అనేదిభారతదేశంలోని ప్రాచీన, అరుదైన మరియువిలువైనమాన్యుస్క్రిప్టులు (తాళపత్రాలు, చేతిరాత ప్రతులు, పాండులిపులు) మరియు ఇతర సాంప్రదాయ జ్ఞాన వనరులనుసంరక్షించడం, డిజిటలైజ్ చేయడం మరియు ప్రజలకుఅందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా భారత ప్రభుత్వం చేపట్టిన జాతీయ స్థాయి కార్యక్రమమని, భారతదేశంలో వేల సంవత్సరాలుగా వివిధ భాషలు, లిపులు మరియు ప్రాంతాల్లో భద్రపరచబడిన గ్రంథాలలో చరిత్ర, సాహిత్యం, వైద్యం, విజ్ఞానం, ఖగోళశాస్త్రం, తత్వశాస్త్రం, కళలు, సంస్కృతి మరియు సంప్రదాయ జ్ఞానం వంటి అనేకరంగాలకుసంబంధించినఅమూల్యమైన సమాచారం ఉంది. ఈ జ్ఞాన సంపదను శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షించడం మిషన్ యొక్క ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ మిషన్‌లో భాగంగా మాన్యుస్క్రిప్టుల గుర్తింపు, జాబితా తయారీ, సంరక్షణ, డిజిటలైజేషన్, మెటాడేటా తయారీ మరియు డిజిటల్ రూపంలోఅందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తద్వారా దేశంలోని ప్రాచీన జ్ఞాన సంపద భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందుతుందనీ అన్నారు. జ్ఞాన భారత్మ్ మిషన్ యొక్క ప్రధాన లక్ష్యం:భారతదేశపుఅమూల్యమైనమాన్యుస్క్రిప్ట్ వారసత్వాన్ని "సంరక్షణ డిజిటలైజేషన్ ▪ ప్రాప్యత పరిశోధన" అనే విధానంతో భద్రపరచి, భారతీయ సంప్రదాయ జ్ఞానాన్ని దేశీయంగా మరియు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని జిల్లాలో ఎవరి వద్దనైనా ఇలాంటి అమూల్యమైన ప్రాచీన సంపద ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని అతను కలెక్టర్ రెవెన్యూ ఛాంబర్ లోఅందించాలని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

# కొత్తపల్లి మండల స్థాయి టోర్నమెంట్



నారాయణపేట సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) కొత్తపల్లి మండల స్థాయి ఆటల పోటీలను ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు ఎమ్ఈఓ ఆంజనేయులు, పిడి కతలప్ప తెలిపారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ భర్త శ్రీనివాస్ రెడ్డి , తాహసీల్దార్ జయరాములు మరియు ఎంపీడిఓ కొండన్న ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిడిజింత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ టోర్నమెంట్ లో 6వ తరగతి నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పాల్గొనవలసిందిగా కోరారు. కోకో ,కబడ్డీ, వాలీబాల్ పోటీలలో అండర్ 14 వారు 2013 తరువాత మరియు అండర్ 17 వారు 2010 తరువాత జన్మించినవారు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే. శ్రీనివాస్,దేవేందర్,హన్మంతు పాల్గొన్నారు.

# కాళోజీ జయంతి సందర్భంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్




వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర);-ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ఘనంగా నివాళు లర్పించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, వారి భావాలను ప్రతిబింబించిన మహనీయుడిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాజిక చైతన్యాన్ని తన రచనల ద్వారా ప్రజల్లో నింపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు అందిస్తున్న గొప్ప గౌరవమని తెలిపారు. యువత కాళోజీ సాహిత్యం, ఆయన ఆశయాలను అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డి ఆర్వో విజయలక్ష్మి,డిపియార్వో ప్రేమలత మరియు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): 09 రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారం అర్హులైన లబ్ధిదారులు సహకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని చెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలనలో భాగంగా అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారురాలు అనిత తనకు మంజూరైన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని బుధవారం గృహప్రవేశం చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి నూతన గృహాన్ని సందర్శించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారురాలు అనిత ఆమె భర్త రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటిని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు పథకం ద్వారా లబ్ధి పొందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని,మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశం చేసుకున్న అనిత కుటుంబాన్ని కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవడం అభినందనీయమని,గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మార్వో సైదులు, ఎంపీడీవో, చెన్నారం సర్పంచ్ ప్రేమలత, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా తొలగించాలి

### నవీన్‌రెడ్డి అనుచిత, దురహంకార వ్యాఖ్యలు ఖండనీయం..
### కేసీఆర్ ఇచ్చిన దళిత హామీలు ఏమయ్యాయి?
### ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలి
### విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు



బోడుప్పల్,సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా తొలగించాలని, నవీన్‌రెడ్డి చేసిన అనుచిత, దురహంకార వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు డిమాండ్ చేశారు. బోడుప్పల్ సర్కిల్ లోని ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, ప్రజలను, సామాజిక వర్గాలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని రాపోలు రాములు అన్నారు. తాతా మధు, నవీన్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేసిన వారిపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ దళిత హామీలు ఏమయ్యాయిమాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రాపోలు రాములు ప్రశ్నించారు. దళితులకు ముఖ్యమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటి అమలులో ఎంతవరకు చిత్తశుద్ధి చూపిందో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. దళితులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన లెక్కలు చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉందన్నారు. ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్అధికారంలో ఉన్న సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన కేసీఆర్ ఇప్పుడు ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని రాపోలు రాములు విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా రాజకీయాలు చేయడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రజల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను కలవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైనా ఉందని రాపోలు రాములు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇతర పార్టీలపై విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. ఈ సందర్భంగా తాతా మధు, నవీన్‌రెడ్డి వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాపోలు రాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫేడరెషన్ వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు అబ్రహం లింకన్, ప్రదాన కార్యదర్శి గడ్డం యాదగిరి,కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్,సభ్యులు రామకృష్ణారెడ్డి,మహేష్, మధుసూదన్,ఎర్ర యాదగిరి

# జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పురాతన గ్రంథాల గుర్తింపు

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08,(విజన్ ఆంధ్ర)జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరచే ప్రక్రియపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు, పాత పత్రాలు, తాళపత్ర గ్రంథాల సమాచారాన్ని అధికారులకు అందించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను శాస్త్రీయ పద్ధతులలో డిజిటలైజేషన్ చేసి, వాటి సమాచారాన్ని రక్షించడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కేంద్రీకృత ప్రదేశంలో భద్రపరిచి, కేంద్రీకృత డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలు, స్థానిక వారసత్వానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేందుకు జ్ఞాన భారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ లకు చెక్ పవర్ రద్దు చేయడం సరైందికాదు

### చెక్ పవర్ రద్దుతో అధికారుల చుట్టూ తిరుగలేము
### సర్పంచ్ లసంఘంరాష్ట్ర కార్యదర్శి గవినోళ్ల శ్రీనివాస్



నారాయణపేట సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వం ఉప సర్పంచ్లకు చెక్ పవర్ రద్దుచేసి సర్పంచ్లను అధికారుల చుట్టూ తిప్పుకునే ప్రయత్నం చేస్తుందని సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గవినోళ్ళ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న కొత్త నిబంధనలు సర్పంచులను మరింత ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయకుండా, సర్పంచ్ సంతకం చేసిన తర్వాత వారం రోజుల్లోపు ఉప సర్పంచ్ తప్పనిసరిగా సంతకం చేయాలని, అలా చేయని పక్షంలో సర్పంచ్ జిల్లా కలెక్టర్ ద్వారా ప్రొసీడింగ్స్ తీసుకొని నిధులు డ్రా చేసుకునే విధానం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఇది సమస్యకు పరిష్కారం కాదని, సర్పంచులను మరింత ఇబ్బందులకు గురిచేసే చర్య మాత్రమేనని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ ఒక చెక్కు కోసం వారం రోజుల పాటు ఉప సర్పంచ్‌ను అడుక్కోవాలా? వారం రోజుల తర్వాత జిల్లా కలెక్టర్‌ను అడుక్కోవాలా? ఇదేనా సర్పంచ్‌ల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం?" అని ఆయన ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన సర్పంచ్‌లకు ప్రతి విషయంలోనూ అడ్డంకులు సృష్టించడం వల్ల గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు. ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల వినియోగంలో స్పష్టమైన అధికారాలు, బాధ్యతలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ విషయంలో సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తే, సర్పంచ్‌లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్పష్టమైన, శాశ్వతమైన పరిష్కారం చూపాలని గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొత్త నిబంధనల పేరుతో సర్పంచ్‌లను అధికారుల చుట్టూ తిప్పే విధానాన్ని తీసుకురావద్దని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్ అంటే ప్రజలు ఎన్నుకున్న గ్రామ నాయకుడు. గ్రామ అభివృద్ధికి బాధ్యత వహించే సర్పంచ్‌ను ప్రతి చిన్న పనికీ ఇతరుల అనుమతి కోసం తిరిగే పరిస్థితిలోకి నెట్టడం సరికాదు. గ్రామ పంచాయతీల్లో పరిపాలన సజావుగా సాగేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ విషయంలో సర్పంచ్‌లకు ఇబ్బంది కలగకుండా, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా తక్షణమే తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ

### విద్యార్థుల గణిత అభ్యసనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
### అందరికీ పాఠ్యపుస్తకాలు, పనిపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలి




కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర)విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి డి.వాసంతి సూచించారు. బుధవారం ప్రణాళిక సమన్వయకర్త సతీష్‌కుమార్‌తో కలిసి కేటీపీఎస్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయి, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులను పరిశీలించారు. పాఠశాలలోని ప్రాథమిక స్థాయి అభ్యసన నివేదికను పరిశీలించిన డీఈఓ.. గణితంలో విద్యార్థులు గుణకారాలు, భాగహారాలు చేయడంలో వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులలో గణిత ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు గుణకారాలు, భాగహారాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. పాఠశాలలో ఏఎక్స్‌ఎల్ కార్యక్రమం ప్రారంభించలేదని గుర్తించిన ఆమె వెంటనే కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పునరభ్యసన సమయపట్టిక, గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించిన ఎఫ్‌ఆర్‌ఎస్ తనిఖీ వివరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. కొంతమంది విద్యార్థులకు పనిపుస్తకాలు అందలేదని గుర్తించిన డీఈఓ.. వారికి వెంటనే పనిపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. అనంతరం మూడో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలి పాఠ్యాంశ బోధనను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశం పూర్తిగా అర్థమయ్యేలా సులభమైన పద్ధతుల్లో బోధించాలని సూచించారు.

**మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి**పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కూడా డీఈఓ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన భోజన పట్టికను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులందరికీ నాణ్యమైన, సరిపడా భోజనం అందేలా చూడాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేయాలని డీఈఓ డి.వాసంతి సూచించారు.

# గణపతి ఉత్సవాలకు పకడ్బందీ భద్రత

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
### నేర సమీక్షలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాలు



కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర)రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీసు శాఖ పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. శోభాయాత్రల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.

**క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు ప్రాధాన్యం**

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా ఆధారాలను పక్కాగా సేకరించాలని ఎస్పీ సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం చేయరాదని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచి నేరస్తులకు శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

**గణపతి మండపాలపై ప్రత్యేక దృష్టి**

గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, భద్రతా సూచనలను వివరించాలని ఎస్పీ ఆదేశించారు. శోభాయాత్రల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను పకడ్బందీగా నియంత్రించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిరంతరం రోడ్లపై అందుబాటులో ఉంటూ ప్రజలకు భద్రతా భరోసా కల్పించాలని సూచించారు.

**గంజాయి, మట్కా, జూదంపై ఉక్కుపాదం**

గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంతో పాటు మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను గుర్తించడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తం**

సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసాల్లో నగదు కోల్పోయిన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

**బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక నిఘా**రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారితో పాటు ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడే వారిపై నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## గద్వాల శివారు భూముల్లో పట్టాల పరిశీలనతహసీల్దార్ హరికృష్ణ

గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల మండలం, గ్రామ శివారు పరిధిలోని సర్వే నంబర్లు 968, 969, 979, 980, 983, 984, 985లో ప్రభుత్వం సేకరించిన భూముల్లో 2013లో ఇంటి స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ అసలు పట్టా ధ్రువపత్రాలు, ఇతర సంబంధిత పత్రాలను సెప్టెంబర్ 18లోగా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టా పత్రాలను ప్రభుత్వ రికార్డులతో సరిపోల్చి పరిశీలించనున్నట్లు తెలిపారు. మొత్తం 558 మంది దరఖాస్తుదారుల్లో 375 మంది పత్రాలు సమర్పించగా, ఇంకా 183 మంది సమర్పించాల్సి ఉందన్నారు. గడువులోగా పత్రాలు అందజేయకపోతే అందుబాటులో ఉన్న ప్రభుత్వ రికార్డుల ఆధారంగా తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని స్పష్టం చేశారు.

## గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

### గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం సి ఐ. శంకర్ : ఎస్సై గురు స్వామి



అయిజ సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర)గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి ఎస్పీ ఆదేశాల మేరకు సి ఐ. శంకర్,ఎస్సై గురు స్వామి మండల ప్రముఖులు, ప్రజలకు సమావేశంలో నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సి ఐ, ఎస్ఐ. మాట్లాడుతూగణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుందని, ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ హ్ttps://policeportal.tspolice.gov.in ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్ లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలి. అదేవిధంగా షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలి. చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేను ఏర్పాటు చేయకూడదని తెలిపారు. గణేష్ నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ సమస్యలు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా గణేష్ కమిటీ వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ఈత రాని వారిని దృష్టిలో ఉంచుకుని కమిటీ వారు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఇట్టి ఉత్సవాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రశాంతంగా జరుపుకొలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## వినాయక మంటపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

### ఎస్సై అశోక్ బాబు



మాగనూర్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) మాగనూరు మండలం లోవినాయక చవితి సందర్భం గాగణేష్ మండపాలు ఏర్పాటు చేయబోయే నిర్వాహకులు తమ మండ పాల పూర్తి వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసు కోని అనుమతి పొందాలని మాగనూరు ఎస్ఐ అశోక్ బాబు కోరారు. నమోదు చేసిన వివరాల కాపీని మాగనూరు పోలీస్ స్టేషన్ లో అందజేయాలని సూచించారు. మండపాల వివరా లు ముందస్తుగా పోలీసు లకు అందించడం ద్వారా అవసరమైన పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేయడంతో పాటు మండప నిర్వాహ కులతో భద్రతా చర్యలు, నిమజ్జనం, ట్రాఫిక్ తదితర అంశాలపై ముఖ్యమైన సమాచారాన్ని సకాలంలో పంచుకునేందుకు వీలవుతుందని తెలిపారు. వినా యక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియు తంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరిం చాలని ఎస్ఐ అశోక్ బాబు విజ్ఞప్తి చేశారు.

## మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరణ

నారాయణపేట, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సిపెచ్ ప్రియాంక తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ విసీ హాల్ లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగాహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఎస్పీ వినీత్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలను తొలగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్పొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల, ఈ.డి.ఎస్.సి.కార్పోరేషన్ అబ్దుల్ ఖలీల్,డీఎస్పీలు తదితరులు నల్లపు లింగయ్య , మహేశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణ రూపొందించాలి : రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్

**ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలి**

**జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా ప్రాచీన గ్రంథాలను గుర్తించి డిజిటలైజ్ చేయాలి**

**ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలి**

**పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలి**

**పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర)ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక రంగ అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫెరెన్స్ కి హాజరయ్యారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ మాట్లాడుతూలి... ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక బలాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 142 వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను సమగ్రంగా రూపొందించాలని తెలిపారు. ప్రతి జిల్లాకు మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, అందులో ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి చేయాల్సిన ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, పెట్టుబడి అవకాశాలు, సందర్శకుల సౌకర్యాలు, ప్రచార కార్యక్రమాలను స్పష్టమైన కాలపరిమితులతో పొందుపరచాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టులపై సమగ్ర సర్వే చేపట్టాలని తెలిపారు. ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా తమ పరిధిలో అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టుల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. తెలుగు పండితులు, ఉర్దూ పండితులు, ఇతర భాషల నిపుణుల వద్ద ఉన్న ప్రాచీన గ్రంథాల వివరాలను సేకరించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్ అమలుకు జిల్లా అదనపు కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. పీపీపీ ఆధారిత పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏ. వాణి ప్రసాద్ సూచించారు. ప్రతి జిల్లాలో పీపీపీ విధానంలో చేపట్టేందుకు అనువైన పర్యాటక ప్రాజెక్టులను గుర్తించాలని, పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలని తెలిపారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు, సాధ్యాసాధ్యాల నివేదికలు, ఆర్ఎఫ్‌పీలు, ఈఓఐలు సిద్ధం చేసి అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రైవేట్ పెట్టుబడిదారులను గుర్తించి, వారితో సమావేశాలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధానం ద్వారా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సూచించారు. గుర్తించిన ముఖ్యమైన, అభివృద్ధి చెందుతున్న పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలు, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది, ఆపరేషన్, నిర్వహణ సిబ్బంది, సైన్‌బోర్డులు, సమాచార కియోస్కులు, శిక్షణ పొందిన స్థానిక గైడ్లు, టికెటింగ్ సౌకర్యం, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు, రహదారులు వంటి సౌకర్యాలను ప్రాధాన్యతా క్రమంలో కల్పించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి రూ. 8.45 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా వారసత్వ ప్రదేశాలనుస్త్ర పర్యాటక ఆకర్షణలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏ. వాణి ప్రసాద్ తెలిపారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక అనుభవాలు, ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను ఫ్లాగ్‌షిప్ డెస్టినేషన్లుగా గుర్తించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. జిల్లా బ్రాండింగ్‌తో పాటు ఫిల్మ్ టూరిజం, ప్రపంచ పర్యాటక దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా టూరిజం శాఖ అధికారి శివాజీ పాల్గొన్నారు

## చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహా ధర్నా

### సొసైటీ అక్రమాలపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేయాలి



నారాయణపేట సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) నారాయణపేట చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొంతకాలంగా నారాయణపేట చేనేత సొసైటీలో 51 కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ప్రజాప్రతినిధులు ఉన్నత స్థాయి అధికారులకు వివరించిన పట్టించుకోవడం లేదని ఇప్పుడైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి నారాయణపేట చేనేత సొసైటీలో జరుగుతున్న అక్రమాలను బయటకు తీసి వారి పైన చట్టరిత చర్యలు తీసుకోవాలని వారు సందర్భంగా డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల థ్రిఫ్ట్ ఫండ్, నేతన్న చేయూత, బీమా పథకం, జియో ట్యాగింగ్ తదితర అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై కూడా విచారణ జరపాలని కోరారు. బీమా పథకాల్లో బినామీ నామినీలను చేర్చుతున్నారన్న ఆరోపణలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు పింఛన్లు, ఉచిత మగ్గాలు, ఇందిరమ్మ ఇళ్లు వెంటనే మంజూరు చేయాలని ముడి సరుకులు అందుబాటులోకి తీసుకురావాలని నేసిన చీరలకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నాలో శ్రీనివాసులు బలరాం కె నారాయణ ఓంప్రకాష్, శ్రీనివాసులు, కృష్ణ మడీవాల్, జి. శ్రీనివాస్, వెంకటేశ్, తాహిర్‌తో పాటు అశోక్, పల్లెబండ్ల నర్సిములు, తఫీ చంద్, డా. యూసుఫ్ తాజ్, కె. కాశప్ప, గద్దం కృష్ణయ్య, చల్లా వెంకటేశ్, హాజీ తుల్రానా, యాబన్నచౌదరి, రాఘవచౌదరి, నీరం వెంకటయ్య, జి. వెంకటేశ్ యాదవ్, సొఫిమజర్ హుసేన్, శ్రీకాంత్, కొసిని విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర)ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – 2026లో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం నర్వ గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలను వేగవంతం చేసి నిర్ణీత గడువుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని టేకుమట్ల గ్రామంలో తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాబు లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కుందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసిల్దార్ తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. అనంతరం వేలాల గ్రామంలో ఇసుక రీచ్ నుండి ఎస్.ఎస్.ఎం.ఎం.ఎస్. వెబ్ సైట్ ద్వారా చేపడుతున్న ఇసుక సరఫరా ప్రక్రియను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఇసుకను పారదర్శకంగా, అధికారికంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు బుకింగ్ ప్రకారం నిర్ణీత గడువులోగా సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షించాలని, ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర)ప్రభుత్వ పింగిళి డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న జరగనున్న కంబైన్డ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ కేంద్రంను పరిశీలించిన కలెక్టర్ ఈ నెల 13వ తేదీన( ఆదివారం) జరగనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ 2, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ –2 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లి లోని పింగిళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కళాశాలకు చేరుకున్న కలెక్టర్‌కు కళాశాల సిబ్బంది ఘన స్వాగతం పలకగా, ఎన్‌సీసీ కేడేట్లు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఎంతమంది అభ్యర్థులకు పరీక్షకు కేటాయించారనే వివరాలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కోసం కేటాయించిన తరగతి గదులను పరిశీలించారు. కళాశాలలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గదిని సందర్శించి పరీక్షకు సంబంధించి వచ్చిన మెటీరియల్ వివరాలను ఎగ్జామినేషన్ ఇన్చార్జి సుహాసిని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ...పరీక్ష నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పరీక్షా గదుల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్ లోని పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్ కలెక్టర్ కు వివరించారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్డీఏ, నావల్ అకాడమీ పరీక్ష ఈనెల 13న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అదేవిధంగా వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో సిడిఎస్ పరీక్ష ఉదయం 9 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అధికారులు తెలిపారు. తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్‌పింగిళి ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలను సందర్శించిన కలెక్టర్ కళాశాలలోని తరగతులైన పరిశీలించారు. బీసీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. చదువులు పూర్తయిన వెంటనే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని, సాఫ్ట్వేర్ రంగంలోనూ ఉద్యోగాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కళాశాలలో విద్యార్థినుల సంఖ్య, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలను, మౌలిక వసతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు



ఆదిలాబాద్ జిల్లా)విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు బుధవారం పెన్ గంగా భవన్ లోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో భాగంగా అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, అధికారులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ప్రజానీకానికి అర్థమయ్యేలా తెలంగాణ యాసలో ఎన్నో కవితలు రచించి, ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ సేవలకు కేంద్ర ప్రభుత్వం 1992 లో పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిందని చెప్పారు. ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కాళోజీ లాంటి గొప్ప వ్యక్తుల జయంతులను ఈ విధంగా అధికారికంగా నిర్వహించుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల అధికారికంగా నిర్వహించడం ద్వారా భావితరాల వారికి వారి గొప్పతనాన్ని తెలియజెప్పిన వారిమవుతామని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ స్రవంతి, ఏవో వర్ణ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ వారి రైడింగ్ యాప్..

హైదరాబాద్, సెప్టెంబర్ 9, తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమిషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమిషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## నేడు మంచిర్యాల లో జనసేన పార్టీ పార్లమెంట్ స్థాయి సమావేశం

### పార్లమెంట్ కో ఆర్డినేటర్ చుంచు రాజ్ కిరణ్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర)నేడు మంచిర్యాల పట్టణంలో జనసేన పార్టీ పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ చుంచు రాజ్ కిరణ్ అన్నారు. బుధవారం చుంచు రాజ్ కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశం లో మాట్లాడారు. నేడు ఉదయం 10 గంటలకు మంచిర్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో నిర్వహించే పెద్దపల్లి,ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి జనసేన నాయకులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దుంపటి శ్రీనివాస్, పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ లు మంతెన సంపత్, గొట్టిముక్కల నరేష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిదులు మూల హరీష్ గౌడ్,శివ రెడ్డి, మంచిర్యాల జిల్లా నాయకులు నల్లతీగల మహేష్, వడ్లకొండ జీవన్,విష్ణు,రమేష్,రక్షిత్, సుధాకర్,సాగర్,పవన్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ల జాబితా సవరణను పకడ్బందీగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా

### అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలి క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర సీఈఓ సుదర్శన్‌రెడ్డి

ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో )ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి తాంసీ, భీంపూర్ మండలాల్లో సీఈఓ పర్యటించారు. తాంసీ మండలం ఘోట్కూరి, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన తదితర ప్రక్రియలను తనిఖీ చేశారు.బీఎల్‌ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈఓ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని



స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరిస్తున్నామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పత్రాలు అందుబాటులో లేని సందర్భాల్లో తహశీల్దార్లు సంబంధిత వ్యక్తులకు మార్గదర్శకాలు అందించి, అవసరమైన పత్రాలను సేకరించి పూర్తిస్థాయిలో ధ్రువీకరించాలని సూచించారు. ఈ ప్రక్రియ అనంతరం కలెక్టర్ల స్థాయిలో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.గత మూడు రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోందని, జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగుతోందని ఆయన వివరించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌ఓలు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఈఓ సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు.పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని డైట్ కళాశాల, సంజయ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీఈఓ, కలెక్టర్ సందర్శించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, ఆదిలాబాదు, తాంసీ, భీంపూర్ తహశీల్దార్లు శ్రీనివాస్, గణేష్, రమేష్, ఎన్నికల నాయబ్ తహశీల్దార్లు సూరజ్, ఇస్తారీ, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయండి

### సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పిలుపు.

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 09 భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ పోరాట చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ భూమికోసం భుక్తి కోసం మట్టి మనుషులు సాగించిన తెలంగాణ స్వాతంత్ర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఆ సాయిధ పోరాటాన్ని గుర్తుగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో వారోత్సవాలునిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మేడిక్కడ తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా స్థాయి వారోత్సవాల ప్రారంభ సభ ఉంటుందని తదనంతరం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమంనిర్వహించబడుతుందని అలనాడు నిజాం దేశ్ముకులు జాగిర్దారులు దొరలు భూస్వాముల సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు ఇచ్చిన అమరవీరులను స్మరిస్తూ వారి కుటుంబాలను ఈ కార్యక్రమంలో భాగ్యసాములు చేస్తామన్నారు వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పోరాటాల జ్ఞాపక ప్రాంతాలను



సిపిఐ సందర్శిస్తుందని ఫయాజ్ వివరించారు జిల్లాలో కొల్లాపూర్ పెద్దకొత్తపల్లి కోడేరు నాగర్ కర్నూల్ తెలకపల్లి అచ్చంపేట అమ్రాబాద్ బిజినేపల్లి తిమ్మాజీపేట చారగొండ లింగాల కల్వకుర్తి ఊరకొండ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన తెలియజేశారు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తే ఆనాటి తెలంగాణ పోరాటానికి సమాజానికి గౌరవించిన వాళ్ళు అవుతారని ఆయన గుర్తు చేశారు ప్రభుత్వాలు ఎన్ని మారినా తెలంగాణ రైతాంగ సాయితో పోరాటం గురించి గొప్పలు చెప్తారు .కానీ అధికారంలోకి వచ్చాక మాత్రం ఆ ప్రజా ఉద్యమాన్ని గౌరవించడానికి ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం దురదృష్టకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .ఆరోజు మనతో పాటు విలీలమైన ప్రస్తుతం కర్ణాటక మహారాష్ట్రలో ఉన్న ప్రాంతాల్లో గుల్బర్గా రాయచూర్ ఔరంగాబాద్ తదితర ప్రాంతాల్లో కర్ణాటక మహారాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా కార్యక్రమాలు నిర్వహిస్తాయి కానీ ఉద్యమానికి ఊపిరి పోసిన తెలంగాణ గడ్డపై మాత్రం సాయితో పోరాటానికి గుర్తించడానికి ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం క్షమించరాని నేరంగా సిపిఐ భావిస్తుంది కొంతమంది దీని ఉద్యమంగా గౌరవించలేరు మరికొన్ని పార్టీలు దీన్ని కమ్యూనిస్టుల నుండి హైజాక్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనేది అణిచివేతకు ఎట్టి చాకిరికి దొరలభూస్వాముల కబంధహస్తాల నుండి తెలంగాణను విముక్తి చేసిన మాత్రమే పోరాటాన్ని కులం మతం ప్రాంతం పేరుతో విభజించాలని కుట్రలు కొన్ని పార్టీలు చేస్తున్నాయని ఆయనతీవ్రంగాఖండించారు .నేటి సమాజం పైన ముఖ్యంగా ఈ తరంలో ఉన్న జంజి పై నిజమైన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో నేటి సమాజానికితెలియజేయడానికి ఈ ఉత్సవాల ఒక వేదికగా సిపిఐ మార్చబోతుందని ఆయన వివరించారు. ప్రజలందరూరాజకీయాలకతీతంగా ఈ వారోత్సవాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) : సెప్టెంబర్ 11న జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రద చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రజలకు కోరారు. ఆనాడు భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా కూడా తెలంగాణ ప్రాంతం నైజాం రాజు ఆధీనంలో ఉండి నియంత, నిరంకుశ పాలన వల్ల భూస్వాములు, పటేల్ ,పట్వారి లు గ్రామాలలో తమ ఆగడాలు పెట్రేగి పోతున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి, బానిసత్వంకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయినుద్దీన్ పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పిలుపునందుకుని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని, 3000 గ్రామాలను విముక్తి చేసిందని, 4500 మంది కమ్యూనిస్టులు తమ రక్తాన్ని చిందించి ప్రపంచ చరిత్రను సృష్టించారని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో ఏ గ్రామానికి ఏ ప్రాంతానికి పోయినా కూడా నాటి ఆనవాళ్లు ఇంకా కొనసాగుతూ ఉన్నాయని, పాలక ప్రభుత్వాలు ఈ చరిత్రను పాఠ్యాంశాలు చేర్చాలని ఈ చరిత్రను నేటి తరానికి అందించాలని డిమాండ్ చేస్తున్న కూడా పెడచెవిన పెడుతున్నారని అన్నారు. ట్యాంక్ బండి పై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న నాయకుల విగ్రహాలను, సంఘటనలో జరిగిన ప్రాంతాలలో ప్రభుత్వాధికారకంగా టూరిజం పరంగా అభివృద్ధి చేయాలని అన్నారు. సెప్టెంబర్ 11న హనుమకొండ జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ఏకశిల పార్క్ వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించి టాను నాయక్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకటరాజం, కొట్టే పాక రవి తదితరులు పాల్గొన్నారు.

## వేయిస్తంభాల ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర)చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎంపీకి వేద ఆశీర్వచనం అందించారు. ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి. అనిల్ కుమార్, ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ అవధాని, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాటారంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

### తెలంగాణ భాష, యాస, మాండలికాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



కాటారం డివిజన్ ప్రతినిధి, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను కాటారం మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. తెలంగాణ భాష, యాస, మాండలికం కోసం కాళోజీ చేసిన కృషి, ఆయన రచనలు, కవితలు, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను విద్యార్థులు ప్రసంగాల ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థులకు కాళోజీ జీవిత చరిత్రపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమలింగం మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, మాండలికం, అస్తిత్వం, సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కాళోజీ ఆశయాలను కొనసాగించాలంటే మన భాష, యాసను గౌరవించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు నాయక్, పద్మజ, సతీష్, రజిత, కవిత, విజయలక్ష్మి, సంధ్యారాణి, శ్రీధర్, రవికుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.కాటారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎం పి డి ఓ బాబు అధ్యక్షతన కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. సూపరింటెండెంట్ ఎం శ్రీధర్ బాబు, సీనియర్ సహాయకులు, టైపిస్ట్, వి బి రాం సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.కేజీబీవీ కాటారంలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి గౌరవ వందనం సమర్పించిన అనంతరం తెలంగాణ భాష గొప్పదనాన్ని చాటే పాటలు, నృత్యాలు, ఉపన్యాసాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చల్ల సునీత రచించిన తెలంగాణ మాండలిక భాషపై పాటను ఇంటర్మీడియట్ విద్యార్థిని బి. వర్షిణి ఆలపించగా, 6వ తరగతి విద్యార్థినులు కవితలు, పద్యాలు ఆలపించారు. తెలుగు ఉపాధ్యాయులు కవిత, సరిత తదితరులు భాషా వైభవాన్ని చాటే కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చల్ల సునీత కాళోజీ నారాయణరావు గొప్పతనాన్ని కొనియాడుతూ సామాన్యుడినే దేవుడిగా భావించిన మహాకవి ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.అలాగే కాటారం తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ జయంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పించారు. తహసీల్దార్ నాగరాజుతో పాటు కార్యాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళోజి నారాయణ రావు జయంతి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర)పట్టణంలోని ఎస్టీ బాలుర వసతిగృహం లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా కవి కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, అన్యాయాలను ఎత్తిచూపారని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజల్లో చైతన్యం కలిగించిన ఆయన సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు, యువత సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పూరెళ్ల నీతిష్,బచ్చలి అభిరామ్, కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజీ జీవితం ఆదర్శనీయం

### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర)కాళోజీ జయంతిని పురస్కరించుకని హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు పాల్గొన్నారు.ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, చైతన్య స్ఫూర్తిని కలిగించిన కాళోజీ జీవితం ఆదర్శనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్, తదితర ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... తెలంగాణ భాషా దినోత్సవాన్ని కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించుకోవడం ఎంతో



సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులను తన రచనల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువెళ్లి, వారిలో చైతన్యం నింపిన కాళోజీ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు.తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. కాళోజీ వరంగల్‌కు చెందిన వారు కావడం గర్వకారణం అని తెలిపారు. ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి శుభాకాంక్షలను ప్రజలందరికీ ఎంపీ కడియం కావ్య తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కాళోజీ నారాయణ రావు ఆశయాలను కొనసాగిద్దామని నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాస రావు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, పలువురు కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.కాళోజి కళాక్షేత్రంలో..ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో కాళోజీ నారాయణ రావు విగ్రహానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుడా సిపీవో అజిత్ రెడ్డి, ఈఈ బీమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లు

విజయవాడ, సెప్టెంబర్ 9, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉ ంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెల్లలోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది.ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది.

## రీజనల్ రింగ్ రోడ్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని సంబంధిత అధికారులు వేగవంతం చేయాలని ఆదేశించారు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి 09 సెప్టెంబర్ సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలరీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేసి, నేషనల్ హైవే అధికారులకు భూమిని అప్పగించాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోనిసమకృతకార్యాలయసముదాయంలో రీజినల్ రింగ్ రోడ్ భూ సేకరణ నేషనల్ హైవే, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కె హైమావతి తో కలిసి రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సంయుక్తంగామాట్లాడుతూ.కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు రీజనల్ రింగ్ రోడ్ ను ప్రతిష్టాత్మకంగాతీసుకుందని ఈ పెద్ద ప్రాజెక్టును మన జిల్లాలో రాయపోల్, వర్గల్, మర్కుక్, గజ్వేల్, జగదేవ్ పూర్ మండలాల ద్వారా వెళ్తుందని భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలనిఆదేశించారు. ప్రక్రియ వేగవంతం చెయ్యాలని, భూ సేకరణలో ఎలాంటి అవరోధాలు ఎదురైన పరిష్కరించుకోవాలని, రీజినల్ రింగ్ రోడ్డు వల్ల కలిగే అభివృద్ధిని ప్రాంత ప్రజలకు తెలపాలని, ఈ మొత్తం ప్రక్రియలను ఆర్డీఓ ఆధ్వర్యంలో తహసీల్దార్లు ఇతర సిబ్బంది భూ సేకరణ యుద్ధ ప్రాతిపదకన పూర్తి చేసేలాచర్యలుతీసుకోవాలనిఆదేశించారు.అలాగే భూ సేకరణ పూర్తయిన ప్రాంతంలో డ్రోన్ సర్వే నిర్వహించి రైతులు ఎలాంటి క్రాప్ వేయకుండా భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను, భూ సేకరణ పూర్తి చేసిన నేషనల్హైవేఅధికారులకునియమావళి ప్రకారం వారికి అప్పగించాలని ఆదేశించారు.రీజనల్ రింగ్ రోడ్డు కోసం అప్పగించిన భూమి బాధ్యత పూర్తిగా నేషనల్ హైవే అథారిటీ వారిదేనని ఎల్లప్పుడు మానిటర్ చెయ్యాలనిసూచించారు. రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులుసమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, నేషనల్ హైవే అధికారులు, ఆయా మండల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్లిష్ట గుండె సమస్యతో బాధపడుతున్న 78 ఏళ్ల వృద్ధుడికి టావీ ద్వారా విజయవంతమైన చికిత్స

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) : బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్, గణనీయమైన అసెండింగ్ అయోర్టిక్ డైలటేషన్‌తో బాధపడుతున్న 78 ఏళ్ల పురుష రోగికి ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టావీ ) ద్వారా విజయవంతంగా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్ అనేది పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత లోపం. సాధారణంగా అయోర్టిక్ వాల్వ్‌లో మూడు లీఫ్లెట్లు (కవాటాలు) ఉండగా, ఈ పరిస్థితిలో రెండు మాత్రమే ఉంటాయి. కాలక్రమేణా ఈ అసాధారణ నిర్మాణం కారణంగా వాల్వ్ క్రమంగా ఇరుకుగా మారి తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌కు దారితీస్తుంది. దీంతో గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది. ఈ రోగిలో బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు అసెండింగ్ అయోర్టా గణనీయంగా విస్తరించి ఉండటం, అలాగే అయోర్టా అడ్డంగా (హారిజాంటల్‌గా) ఉండటం వల్ల కేసు మరింత క్లిష్టంగా మారింది. ఈ సంక్లిష్ట శరీర నిర్మాణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హార్ట్ టీమ్ సమగ్ర పరిశీలన, అధునాతన ఇమేజింగ్ పరీక్షలు, అత్యంత జాగ్రత్తతో కూడిన ప్రణాళికను రూపొందించింది.రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, క్లిష్టమైన శరీర నిర్మాణ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని హార్ట్ టీమ్ టావీ




విధానాన్ని ఎంచుకుంది. ఈ అత్యాధునిక, మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో తొడ భాగంలోని రక్తనాళం (ఫెమొరల్ ఆర్టరీ) ద్వారా కొత్త కృత్రిమ వాల్వ్‌ను గుండెకు చేరవేసి, దెబ్బతిన్న అయోర్టిక్ వాల్వ్ స్థానంలో అమర్చారు.ఈ క్లిష్టమైన టావీ ప్రక్రియను సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మోదాని విజయవంతంగా నిర్వహించారు. ఆయనకు బహుళ విభాగాల కార్డియాక్ బృందానికి చెందిన డాక్టర్ శ్రవణ్ కుమార్ రాంపల్లి, డాక్టర్ షఫీ, డాక్టర్ వాసు సహకారం అందించారు.ఓపెన్-హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. కొత్తగా అమర్చిన వాల్వ్ సమర్థవంతంగా పనిచేస్తుండగా, అయోర్టిక్ వాల్వ్ ద్వారా రక్తప్రసరణ గణనీయంగా మెరుగుపడింది.చికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా, స్థిరమైన పరిస్థితిలో ఉన్నారు.ఈ క్లిష్టమైన కేసు ద్వారా అధునాతన స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్లు, ఖచ్చితమైన శరీర నిర్మాణ అంచనా, బహుళ విభాగాల హార్ట్ టీమ్ సమన్వయంతో కూడిన వైద్య విధానం ద్వారా సంక్లిష్ట గుండె సమస్యలతో బాధపడుతున్న వృద్ధ రోగులకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని మరోసారి రుజువైంది. ముఖ్యంగా వృద్ధుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శారీరక శ్రమను తట్టుకోలేకపోవడం, ఛాతీ నొప్పి, తల తిరగడం లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌ను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు.ఈ విజయవంతమైన ఫలితం సరైన రోగి ఎంపిక, అధునాతన ఇమేజింగ్ సాంకేతికత, ఖచ్చితమైన ప్రణాళిక, అంకితభావంతో పనిచేసిన బహుళ విభాగాల కార్డియాక్ బృందం సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గుమంది

### 500 డప్పులతో తూముకుంట దద్దరిలింది

### తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

మేడ్చల్ జిల్లా,సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర ప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డి చేసిన అనుచిత, దురహంకార వ్యాఖ్యలను ఖండిస్తూ మేడ్చల్ ' మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో తూముకుంట చౌరస్తా వద్ద బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 డప్పులతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డి చేసిన అనుచిత, దురహంకార వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని, రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.



ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, అహంకారపూరిత రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని వజ్రేష్ యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,మార్కెట్ చైర్మన్ నర్సింహులు యాదవ్,సాయిపేట శ్రీనివాస్,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,అర్టిఓ సభ్యులు జైపాల్ రెడ్డి,మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోమ్మక్ కళ్యాణ్ కుమార్, రాపోలు ఉపేందర్,ఆసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

### మంచిర్యాల ఏసీపీ ప్రకాష్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర)ఈనెల 14 నుండి జరగనున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను వినాయక మండపాల నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక ఏం కన్వెన్షన్ లో వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీసులు చేపట్టే భద్రత పై సానుకూలంగా మాట్లాడినందుకు చాల సంతోషకారం అన్నారు. ప్రతి వినాయక మండపం వద్ద పోలీసుల సూచనలు పాటించాలని,మండపం నిర్వాహకులు తప్పనిసరిగా సమాచారం అందజేయాలనీ, ఎలాంటి అపోహలకు తవివ్వవద్దని తెలిపారు. మండపం కు విద్యుత్ కనెక్షన్ అనుమతి పొందాలని, రోడ్లు పూర్తిగా మూసేసేవిధంగా ఏర్పాటు చేయవద్దని,నిమజ్జనం రోజు పోలీసుల సూచనల మేరకే సమయానికి తరలించాలని, మద్యం సేవించరాదని, ఎలాంటి గొడవలు కాకుండ శాంతియుతంగా తరలించాలని సూచించారు.ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డిజే లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వబొమని తెలిపారు. మండపాల వద్ద తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.మండపం వద్ద మద్యం, జూదం లాంటివి ఉండకూడదని, ఆకతాయిల ఆగడాలను ఉపేక్షించమని, రౌడీ షీటర్స్, పాత నేరస్తుల పై నిఘా పెంచుతామణి, అంతే కాకుండా పలువురిని బైండొవర్ చేస్తామన్నారు. పట్టణంలో రోడ్ల పనులు జసరుగుతున్న నేపథ్యంలో నిమజ్జనం రోజు దారి మల్లించడం జరగనుందని పేర్కొన్నారు. ప్రతి మండపం వద్ద కమిటీ సభ్యులు రాత్రి వేల నిద్రించాలని పేర్కొన్నారు. కాగా నిర్వాహకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో పట్టణ సిఐ ప్రమోద్ రావు, ఎస్ ఐ లు మధుసూదన్,రమేష్,శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### బీఎల్ఓలు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ, డాక్యుమెంట్ల అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బీఎల్ఓలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు.బుధవారం గద్వాల పట్టణంలోని 28, 37వ వార్డుల పరిధిలోని 266, 267, 268, 269 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరు కాకపోయినా బీఎల్ఓలు వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించవచ్చని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి ఏ, బి, సి కేటగిరీలకు అనుగుణంగా అవసరమైన పత్రాలను మాత్రమే సేకరించాలని సూచించారు. అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలను రెండు రోజుల్లో జారీ చేసేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, మంజులరాణి, అదనపు ఏఈఆర్ఓ సతీష్, సూపర్‌వైజర్ నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 09 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర)వర్షపు నీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతిఅధికారులనుఆదేశించారు.బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్మిస్తున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలోపరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా పోకుండా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు.ముందుగా రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ గ్రామాల్లో, మండలాల్లో అధికారులు అన్ని ప్రభుత్వ భవనాలలో ఏర్పాటు చెయ్యాలని, తద్వారా ప్రజలు వారి గృహాలలో ఏర్పాటు చేసుకోవడానికి ఒక మెడల్ గా ఉంటుందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోప్రజలనుభాగస్వాములను చేస్తూ నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాను నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డిఆర్డిఓ రమేష్, కొండపాక ఎంపీడిఓ వెంకటేశ్వర్లు, దుద్దేడ సర్పంచ్ శివ కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజి నారాయణరావు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర)తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజి నారాయణరావు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు ల తో కలిసి హాజరై కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజలందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ వైతాళికుడిగా జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించాడని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతి రోజున తెలంగాణ భాషా దినోత్సవంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థి దశలోనే నిజాంను ఎదిరించి తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని, తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. కాళోజీ నారాయణరావు బహు బాషా కోవిదులు అని, కవిగా, రచయితగా తెలుగుతో పాటు వివిధ భాషలలో హ్యూమన్ రైట్స్, కుల



వివక్ష లేని సమాజంపై రచనలు చేశారని తెలిపారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ రావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ డొనేషన్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించిన విష్ణు వర్ధన్ రెడ్డి



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర)అంజుమన్-ఏ-హైదర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అతిపెద్ద బ్లడ్ డొనేషన్ క్యాంప్ యొక్క పోస్టర్ ని రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం అనేది చాలా గొప్ప విషయం అని క్యాన్సర్ మరియు తలసేమియా వ్యాధి గ్రస్తులకు ఇది చాలా ఉపయోగపడుతుందని 11.09.2026 న నిర్వహించే ఈ రక్తదాన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు, రక్తదానం చేయడం వల్ల ఒకరికి ప్రాణ దానం చేసినవారిమౌతామని ఆయన అన్నారు.అనంతరం కార్యక్రమ నిర్వాహకులైన అంజుమన్-ఏ-హైదర్ వెల్ఫేర్ సొసైటీ వారిని అభినందించారు.

## గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని బీఆర్ఎస్ మానుకోవాలి

### ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు.. గతంలో చేసిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కొత్త నాటకాలు.. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 ( విజన్ ఆంధ్ర ): బీఆర్ఎస్ నాయకులు గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని వీడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రతిరోజూ కొత్త అంశాలను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు తదితరులు గతంలో చేసిన వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరును ప్రజలు మరిచిపోలేదని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కుటుంబ సభ్యుల నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న వారు ఇప్పుడు బయటకు వచ్చి ఇతరులపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.మీరు అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలతో ఎలా వ్యవహరించారో తెలంగాణ సమాజం మొత్తం చూసింది. ఇప్పుడు మీరు చేస్తున్న ప్రతి పని కూడా ప్రజలు గమనిస్తున్నారు. కొత్తగా ఏదో చేస్తున్నామని, ప్రజలను ఆకర్షిస్తున్నామని అనుకోవచ్చు. కానీ మీ గుండాయిజం, రౌడీయిజం ప్రజలకు కొత్తేమీ కాదు" అని నాయిని అన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలోనూ అధికారులను, ప్రతిపక్ష నాయకులను బెదిరించడం,




దూషించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి సంస్కృతిని బీఆర్ఎస్ నాయకులు కొనసాగించారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అని, అక్కడ సభ్యులు హుందాగా, మర్యాదగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు.సభ అంటే గౌరవం, మర్యాద, ప్రజాస్వామ్య చర్చకు వేదిక. కానీ మీ ప్రవర్తన చూస్తుంటే సభా సంప్రదాయాలపై మీకు గౌరవం లేదనిపిస్తోంది. ఇంత ఫ్రస్ట్రేషన్ ఎందుకు? మీకు ఓపిక లేదు, ఇతరుల సలహాలు వినే ఓపిక లేదు. ప్రజలు మాత్రం మీ వ్యవహారశైలిని నిశితంగా గమనిస్తున్నారు" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలను నెరవేర్చలేదని విమర్శించారు.పదేళ్లు అధికారంలో ఉన్న మీరు ఇచ్చిన హామీల్లో ఎన్ని పూర్తి చేశారు? మూడెకరాల భూమి, కేజీ టు పీజీ, నిరుద్యోగ భృతి వంటి హామీల పరిస్థితి ఏమిటి? ముందు వాటికి సమాధానం చెప్పండి. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం వదిలిన ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ ఒక్కో పథకాన్ని అమలు చేయడానికి ఎంతో కష్టపడుతున్నాం" అని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. అప్పులు, ఆర్థిక ఇబ్బందుల మధ్య కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం సాధించిన ప్రగతిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.అధికారంలోకి రావడానికి అడ్డదారు వెతకడం, ప్రజల్లో గందరగోళం సృష్టించడం కాకుండా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని నాయిని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన రాజకీయ సంస్కృతి అవసరమని, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా రాజకీయాలు చేయాలని కోరారు.దళితుల పట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కూడా ప్రజలు మరిచిపోలేదని నాయిని అన్నారు. అసెంబ్లీలో కొత్త అంశాలను లేవనెత్తి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం కంటే, గతంలో తాము చేసిన తప్పులకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు."మీరు ఎంత కొత్తగా వేషాలు వేసినా, ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. గతంలో మీరు చేసిన ప్రతి పని ప్రజల కళ్ల ముందే ఉంది. ప్రజాస్వామ్యాన్ని గౌరవించండి. గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని మానుకోండి. ప్రజలకు ఉపయోగపడే రాజకీయాలు చేయండి" అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ..

### జిల్లా కలెక్టర్, సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన విష్ణు వర్ధన్ రెడ్డి

హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర ): హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను, అలాగే సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపీఎస్ గారిని యువ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ట్రై సిటీస్ హాఫ్ మారథాన్" 2026, ఎడిషన్2" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సీపీ శ్వేత, ఐపీఎస్ ని కలిసి మారథాన్ నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.అక్టోబర్ 11, 2026న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ నుంచి మారథాన్ ప్రారంభం కానుంది. ఇందులో 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు వరంగల్ ట్రై సిటీస్‌లో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మారథాన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సహకారం కోరినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సోమయ్య, కందుకూరు శ్రీనివాస్, రన్నర్స్ చరణ్, సరస్వతి తదితర నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో రేవంత్ కు ఫుల్ పవర్స్...

హైదరాబాద్, సెప్టెంబర్ 9, తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, మీడియా ముందుకు వచ్చి సొంత పార్టీ నేతలపై లేదా ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కడం కాంగ్రెస్‌లో చాలా కాలంగా నడుస్తున్న సంస్కృతి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాగార్జునసాగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ చైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు ఇస్తూ అసంతృప్తులకు చెక్ పెడుతున్నారు. ఇటీవలే ఒకే రోజు ఏకంగా తొమ్మిది మంది కీలక నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇందులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు నోటీసులు ఇవ్వగా.. గజ్వేల్‌లో ఘర్షణలలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డిలకు నోటీసులు వెళ్లాయి.

# పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను తాను గుర్తిస్తా

## -పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్:09(విజన్ ఆంధ్ర)పార్టీలో పదవులు రాని వారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను తాను గుర్తిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం బుధవారం సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ప్రకటించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్‌తో పాటు ఇతర ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం ప్రకటించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీకి పదవులు వచ్చిన వారు, రాని వారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో పదవులు రాని వారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను తాను గుర్తిస్తానని జగ్గారెడ్డి అన్నారు. అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులతో సమీక్ష సమావేశాలుసంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. నాలుగు మండలాలకు చెందిన గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అదేవిధంగా రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, అధికారులతోనూ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా సమావేశాలు నిర్వహించి, ప్రతి ఒక్కరితో వన్‌టువన్‌గా మాట్లాడతానని చెప్పారు. ఈ సమావేశాలకు పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను కూడా పిలిచి ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.

# నిలిచి గెలిస్తేనే ఘనత. ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత-- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ఆంధ్ర): జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురై నప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని, వైఫల్యాలను వెక్కిరించి అఘాయిత్యాల ఆలోచనను మానుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన మనిషి పరిపూర్ణడు అవుతాడని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినం సెప్టెంబరు 10 నుండి అక్టోబర్ 10 వరకు చేపట్టనున్న నెలరోజుల, రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని సంబంధిత బ్యానర్, పోస్టర్లు, కరపత్రాలను ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యల నివారణపై నిరంతరం కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది జీవితాలను కాపాడడం అభినందనీయమని, ఇటీవల పోలీస్ శాఖలో జరుగుతున్న ఆత్మహత్యల పరంపరను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర పోలీసు డిజిపి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసు వారికి ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించడం మంచి కార్యక్రమని, మహబూబాబాద్ జిల్లాలో కూడా విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆత్మ హత్యల నివారణ కమిటీ చైర్మన్ & సైకాలజిస్ట్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే, అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారనీ తెలిపారు. సెప్టెంబర్ 10వ తారీకు ఆత్మహత్యల నివారణ దినం ను పురస్కరించుకొని తొర్రూరు డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవన్లో ఉదయం 10 గంటలకు యువత కు ఆత్మహత్యల నివారణ సదస్సు నిర్వహించనున్నామని ప్రతి ఒక్కరూ ఈ సదస్సును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ హత్యల నివారణ కమిటీ సభ్యులు రాంపల్లి లింగమూర్తి, ఆరోగ్య మిత్ర ప్రతినిధులు సుందర్ నాయక్ ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి



హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 విజన్ ఆంధ్ర )పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితాన్ని చాటే విధంగా "మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కుడా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వినాయక చవితి మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని, అదే సమయంలో ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను కూడా గుర్తు చేసే పండుగగా జరుపుకోవాలని అన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించడం ద్వారా భక్తిని చాటడంతో పాటు చెరువులు, నదులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన మట్టి గణపతులను ప్రతిష్టించేందుకు ముందుకు రావాలని కోరారు. "వినాయకుడిని మట్టితో పూజించి.. అదే మట్టిని ప్రకృతికి తిరిగి అందిద్దాం. మన భక్తి వల్ల ప్రకృతికి హాని కలగకుండా చూసుకోవడం నిజమైన బాధ్యత" అని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే నేటి నుంచే పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూడా ప్రాజెక్ట్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఈఈ భీమారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభం



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ :09(విజన్ ఆంధ్ర) బ్రెస్ట్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. బుధవారం నాడు కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ స్కానింగ్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళలు ఎటువంటి అనుమానాస్పద లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, అందుబాటులో ఉన్న స్క్రీనింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, ముందస్తు గుర్తింపు ▪ముందస్తు చికిత్స లక్ష్యంగా ఇలాంటి స్క్రీనింగ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏ ఐ జి హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. లలితాదేవి,ఓ పీ ఎన్ సి డి డాక్టర్ . దీప్తి, అడిషనల్ డి ఆర్ డి ఏ డా. బాలరాజ్ గారు, కంది ఎంపీడీఓ శ్రీనివాస్,, సర్పంచ్ శ్రీ సాయి శ్రీరామ్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

## చండూరులో రూ. 1,69,500 సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చండూరు,సెప్టెంబర్10,(విజన్ ఆంధ్ర): స్థానిక మున్సిపాలిటీ ఆవరణలో బుధవారం రూ. 1,69,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు,కౌన్సిలర్లు కలిసి ఆరుగురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం,ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు ఆర్థిక సాయం అందిస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కృషితో నియోజకవర్గంలో అనేకమంది పేద కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రయోజనం పొందుతున్నాయని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చిలుకూరు శ్రీనివాసులు రూ. 39,000,చొప్పరి నరసింహరూ. 40,000,గొర్లకొండ పవన్ కుమార్ రూ. 26,000,బొమ్మకట్టి లక్ష్మి రూ. 26,000,ఖమ్మంపాటి శివమణి రూ. 22,500,భూతరాజు లక్ష్మమ్మ రూ. 16,000,ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పారిజాత జనార్ధన్,బుషిపాక వాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు పున్న ధర్మేందర్, కో-ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య,ఖలీల్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ఐతరాజు మల్లేష్, పన్నాల లింగయ్య,భీమనపల్లి శేఖర్, బొమ్మరబోయిన వెంకటేశం,కన్నెబోయిన నాగరాజు,బెల్లంకొండ శేఖర్, గజ్జల కృష్ణారెడ్డి,కారింగు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనాన్నే ఎత్తుకెళ్లిన దొంగ! స్టేషన్‌లో నిలిపిన పెట్రోలింగ్ వాహనమే టార్గెట్ అర్ధరాత్రి చోరీ..

## రాత్రంతా అదే వాహనంలో షికారు వరంగల్ వైపు వెళ్తుండగా ఎల్కతుర్తి వద్ద ప్రమాదం పట్టుకున్న పోలీసులు




వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర);-దొంగలకు పోలీసులంటే భయం ఉంటుందని అనుకుంటాం.. కానీ కరీంనగర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన చూస్తే మాత్రం దొంగ ఏకంగా పోలీసుల వాహనాన్నే టార్గెట్ చేశాడు! కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిలిపి ఉంచిన పెట్రోలింగ్ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి అర్ధరాత్రి ఎత్తుకెళ్లడం సంచలనంగా మారింది. పోలీసు స్టేషన్ పరిసరాల్లోనే వాహనం చోరీకి గురికావడం తీవ్ర కలకలం రేపింది. వాహనాన్ని తీసుకెళ్లిన దొంగ రాత్రంతా అదే వాహనంలో తిరిగినట్లు సమాచారం. అయితే తెల్లవారుజామున ఆ వాహనం వరంగల్ వైపు వెళ్తుండగా ఎల్కతుర్తి వద్ద ప్రమాదానికి గురైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన పోలీసు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచే పెట్రోలింగ్ వాహనం మాయమవడం వెనుక ఎవరున్నారు? దొంగ ఒక్కడే ఈ పని చేశాడా? వాహనాన్ని ఎలా బయటకు తీసుకెళ్లాడు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

# ఘనంగా కాళజి నారాయణరావు జయంతి వేడుకలు

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర ) : కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. బుధవారము కలెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జిల్లాలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక ఉద్యమకారుడు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజి నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రపంచానికి తెలియజేసిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన సాహిత్యంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి కాళోజి అని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కాళోజి ఆశయాలు, ఆలోచనా విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, యువత ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మానవతా దృక్పథం కోసం కాళోజి చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, డి ఆర్ ఓ స్వర్ణ లత, ఆర్ డి ఓ వాసుచంద్ర, డిప్యూటి కలెక్టర్ పూజ,వ్యవ సాయ శాఖ అధికారి కవిత డి పి ఆర్ ఓ చెన్నమ్మ, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రావూర్ ఊరు చెరువు సమగ్ర సర్వే నివేదిక



ఉమ్మడి రావూర్ గ్రామంలోని (మోత్య తండా పరిధి) ఊరు చెరువు యొక్క అసలు సరిహద్దులు,పాత నక్షా మరియు విస్తీర్ణానికి సంబంధించి స్పష్టమైన వివరాలు అవసరమున్నాయి. రెవెన్యూ మరియు సర్వే అధికారుల ద్వారా చెరువు భూములు,శిఖం భూములు, ప్రభుత్వం నమోదిత సర్వే నంబర్ల ఆధారంగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలి. పాత నక్షా/మ్యాప్ ప్రతులను పరిశీలించి, చెరువు నాలుగు వైపులా అసలు సరిహద్దులు మరియు విస్తీర్ణాన్ని అధికారికంగా నిర్ధారించాలని కోరారు. మోత్య తండా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీమోత్య తండా గ్రామ పంచాయతీలో సుమారు 1500 పైగా జనాభా ఉన్నారు. గ్రామంలో ప్రత్యేకంగా డీలర్ షాపు లేకపోవడంతో ప్రజలు రేషన్ సరుకుల కోసం పొరుగున ఉన్న రావూర్ గ్రామానికి వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్థుల సౌకర్యార్థం రావూర్ లోని రేషన్ డీలర్ స్వయంగా మోత్య తండా గ్రామానికి వచ్చి రేషన్ సరుకులు అందజేసేలా లేదా తండాలోనే సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత తహసీల్దార్, రెవెన్యూ మరియు సర్వే అధికారులను ఆదేశించి ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని సర్పంచ్ భూక్య నరేష్ ఉన్నత అధికారులకు సవినయంగా మనవి చేశారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) : మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' పర్యావరణ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని , పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి .పోస్టర్‌ను విడుదల చేశారు. బుధవారము కలెక్టర్ చాంబర్ నందుతెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో పర్యావరణ ఇంజనీర్ శరత్ చంద్ర వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిసి వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు మరియు ఇతర జల వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా జల వనరుల పరిరక్షణకు తోడ్పడటంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను వినియోగిస్తూ, "మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం ▪ పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని కోరారు. వినాయక చవితి పండుగ ప్రజల్లో ఐక్యత, భక్తి, సోదరభావాన్ని పెంపొందించేలా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది అందరికి వినాయక మట్టి విగ్రహాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రిని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, జాడ్ పి సి ఇ ఓ సుదీర్, బిసి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, డి పి ఓ జయసుధ, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

ముంబై, సెప్టెంబర్ 9, రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది. అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం. ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం.

# మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

**- మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర):వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వివిధ శాఖల అధికారులకు, ఉద్యోగులు, సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, రసాయనాలతో కూడిన రంగుల వినియోగం వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. తద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని ఆమె సూచించారు. ముందుగా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డి.ఆర్.ఓ. ఎ. నిర్మల, ఆర్.డి.ఓ. నవీన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులుతో పాటు పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి






సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 9: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బాధితుల నుంచి లంచం తీసుకుంటూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రెడ్ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కాలేజీకి అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన అధికారి సంగారెడ్డి జిల్లాలోని ఓ కాలేజీకి కొద్ది రోజుల క్రితమే జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అయిన గోవిందరాం తనిఖీకి వెళ్లారు.అయితే అక్కడ చిన్న చిన్న పొరపాట్లు,ఇతర అంశాలను పరిశీలించిన ఆయన వాటిని సరిచేసి కాలేజీకి అనుకూలంగా రిపోర్టు ఇవ్వాలంటే తనకి రూ.50 వేలు లంచంగా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాడు.ఈవిషయంలో చేసేది లేక సదరు కాలేజీ యాజమాన్యం ముందుగా గోవిందరాం కు రూ.30 వేలు ఇచ్చారు.మిగతా డబ్బు కూడా ఇవ్వాలని ఒత్తిడి చేయగా వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ అధికారి అయిన గోవిందరాం తన ఆఫీసులో మిగతా రూ.20 వేల డబ్బులు బాధితుల నుంచి లంచంగా తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈమేరకు అతనిపై అధికారులు కేసు నమోదు చేసి మిగతా విషయాలు దర్యాప్తు చేస్తున్నారు.ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్,ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు,రమేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ మాట్లాడుతూ ఏ అధికారి అయినా లంచం ఇవ్వమంటే మాకు సమాచారం అందించండి అని సూచించారు.



రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారిని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డా. ఉషారాణి గారు మర్యాద పూర్వకంగా రాష్ట్ర సచివాలయం లో కలిసారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు గాంధీ హాస్పిటల్ లో వైద్య సేవల బలోపేతం పై సూపరింటెండెంట్ డా. ఉషారాణి గారికి దిశానిర్దేశం చేశారు. గాంధీ ఆసుపత్రి లో చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు.

# ఈవీఎం గోదాముకు కట్టుదిట్టమైన భద్రత

**- త్రైమాసిక తనిఖీ చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాము పరిశీలన**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9(విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాల నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయన సమగ్రంగా పరిశీలించారు. గోదాం భద్రత, రక్షణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను, భద్రతా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను పరిశీలించి,ఉన్నతాధికారులకు సమగ్ర నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీసిన ఆయన, పోలీస్ గార్డులు 24 గంటలూ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, సీ-సెక్షన్ సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శంకర్ (టీడీపీ), వేనా చారి (కాంగ్రెస్), జబ్బార్ (సీపీఎం), కుమారస్వామి (బీజేపీ), జమీల్ (బీఆర్ఎస్) తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కృష్ణకుమార్‌కు ఘన సన్మానం



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9(విజన్ ఆంధ్ర): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ధనుగల కృష్ణకుమార్ ను బుధవారం ఎంజెపిటిబిసి గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సెప్టెంబర్ 5న నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో కన్వీనర్ & ప్రిన్సిపల్ ఎస్. శ్రీవేణి, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కలిసి కృష్ణకుమార్ ను శాలువాతో సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీవేణి మాట్లాడుతూ... విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల ప్రగతికి కృష్ణకుమార్ సార్ అందిస్తున్న సేవలు అత్యంత ప్రశంసనీయమని కొనియాడారు. ఆయన నిరంతర కృషి, పట్టుదలే ఈ అవార్డు రూపంలో ప్రతిఫలించాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి మరింత మంది ఉత్తమ విద్యార్థులను అందించాలని పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు.



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర); ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు బుధవారం కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ప్రజానీకానికి అర్థమయ్యేలా తెలంగాణ యాసలో ఎన్నో కవితలు రచించి, ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ సేవలకు కేంద్ర ప్రభుత్వం 1992 లో పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిందని చెప్పారు. ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కాళోజీ లాంటి గొప్ప వ్యక్తుల జయంతులను ఈ విధంగా అధికారికంగా నిర్వహించుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇటువంటి మహనీయుల జయంతి ఉత్సవాల అధికారికంగా నిర్వహించడం ద్వారా భావితరాల వారికి వారి గొప్పతనాన్ని తెలియజెప్పిన వారిమవుతామని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బిసి, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఎల్డిఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**- పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ**

**- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలి**

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర); ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ా×=) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవో సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు. బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈఓ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఈఓ సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవోకి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా దూరమవ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు...

**- బీబీ నగర్లో ఎయిమ్స్ ను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**



నిజామాబాద్ సెప్టెంబర్08: (విజన్ ఆంధ్ర )కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. భువనగిరి జిల్లా బీబీ నగర్లో గల ఎయిమ్స్ ( ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. మొత్తం 750 బెడ్ లతో నిర్మిస్తున్న ఎయిమ్స్ లో ప్రస్తుతం 260 అందుబాటులో ఉన్నాయన్నారు. మరో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రధానంగా కేవలం పది రూపాయల ఫీజుతో ఏడాదిపాటు ఓపీ పొందవచ్చన్నారు. అలాగే ఇన్ పేషెంట్ గా అడ్మిట్ అయితే ఒకరోజుకు బెడ్ ఛార్జీ కేవలం రూ.35 తీసుకుంటారన్నారు. కావున పేద మధ్య తరగతి కుటుంబాల వారు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 25 ప్రధాన విభాగాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులు, అత్యవసర వైద్యం కావలసిన వారు ఎయిమ్స్ లో చికిత్స పొందాలన్నారు. అవసరమైన వారు తమను సంప్రదిస్తే రిఫర్ చేస్తామని తెలిపారు.

## 6 గ్యారెంటీలు, ప్రజా సమస్యలు, 22-A భూముల సమస్యపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జనసేన అసెంబ్లీ ముట్టడి



నిజామాబాద్ సెప్టెంబర్08:(విజన్ ఆంధ్ర ) 6 గ్యారెంటీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ముఖ్యంగా 22-A భూముల సమస్యపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన జనసేన నాయకులు, వీరమహిళలను పోలీసులు అరెస్టు చేసి మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మీసాల శ్రీనివాస్ రావు శ్రీధర్ శర్మ ప్రేమ్ గాంధీ , హైందవి రెడ్డి రాంబాబు1 పైడిపల్లి శోభనబాబు , గంగం అజయ్ కుమార్ , ముజఫర్ అలీ , పద్మజ వెంకటలక్ష్మి , భవ్య రేఖ , సందీప్, వెంకటేష్ , విజయ్ కుమార్ తదితర జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు. 22-A భూముల సమస్యతో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలకు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయడం సరికాదని జనసేన నాయకులు అన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- నిరుద్యోగ యువతకు కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపు**

**- పోలీస్ ఉద్యోగార్థుల ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరం సందర్శన**









నిజామాబాద్, సెప్టెంబర్ 09 :(విజన్ ఆంధ్ర )పోలీసు శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన దృష్ట్యా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. పోలీస్ శాఖలో ఎస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో సుమారు 200 మందిని ఎంపిక చేసి, జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. ఉద్యోగార్థులకు భోజన వసతిని సమకూరుస్తూ రెండు నెలల పాటు నిష్ణాతులచే థియరీ, దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చాటేలా శిక్షణ అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు , నిపుణులచే అభ్యర్థులకు మెళకువలు నేర్పిస్తూ, అన్ని విధాలుగా సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా అభ్యర్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. రీజనింగ్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం అంశాలలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన పద్ధతుల గురించి మెళకువలు తెలియజేశారు. ఉద్యోగార్థులకు తానే స్వయంగా నైపుణ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తేనే కొలువు సాధించగల్గుతారని సూచించారు. గమ్యాన్ని చేరుకునే వరకు నిరంతర ప్రయత్నాన్ని కొనసాగిస్తూ ధృడ సంకల్పంతో ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. ప్రపంచంలో అసాధ్యం అన్నది ఏదీ లేదని, సరైన ప్రణాళిక, కష్టపడే తత్వం, సానుకూల దృక్పథంతో కూడిన కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఉద్యోగార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందింపజేశారు. రెండు నెలల పాటు సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, ముందస్తు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. అంకితభావం, పట్టుదల, ఏకాగ్రతతో చదువుతూ ఉచిత శిక్షణ తరగతులను కొలువుల సాధనకు అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. అనవసర భయాలను విడనాడి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, నిరంతర సాధన ద్వారా పోలీస్ రిక్రూట్ మెంట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ, హైదరాబాద్ లో అందించే కోచింగ్ కు ఏమాత్రం తక్కువ కాకుండా మరింత మెరుగైన మెటీరియల్ తో పాటు, నిష్ణాతులైన ఫ్యాకల్టీచే స్థానికంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయించామని చెప్పారు. ప్రీ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ అన్ని విధాలుగా తోడ్పాటును అందించారని జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. అర్హత కలిగిన సమర్థవంతులైన అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలను సాధించి, ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీని ప్రాధాన్యతను అభ్యర్థులు గుర్తెరగాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, నిరంతర సాధన చేయాలని సీ.పీ సూచించారు. రెండు నెలల పాటు వినోదాలు, వేడుకలకు దూరంగా ఉండి, ఏకాగ్రతతో కృషి చేస్తే పోలీస్ శాఖలో చేరాలనే కలను సాకారం చేసుకోగల్గుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్య కిరణ్, నిజామాబాద్ ఏ.సీ.పి ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## కాళోజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**- అదనపు ఎస్పీ వీరారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) : ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నిస్తూ తన కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. ఆయన రచనలు కేవలం సాహిత్యానికే పరిమితం కాకుండా సామాజిక ఉద్యమంగా నిలిచాయని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని నిష్పక్షపాతంగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, ఏఓ సునంద, ఎస్బీ సీఐ నరేష్, ఆర్ఐ శ్రీనివాస్, ఎస్ఐలు పర్వతాలు, రామేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు వినోద్, మగ్దుం భారీ, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవింద్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి వద్దకు వచ్చిన గడిల పరిపాలనను ఖండించండి :- ఉన్నికృష్ణన్

**- అంగన్వాడి వర్కర్లకు ఎన్నికల హామీలను అమలు చేయాలి**




కాప్రా/సెప్టెంబర్ 9 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : అంగనవాడి చలో అసెంబ్లీ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో అంగన్వాడి ఉపధ్యక్షురాలు నాగరాణి,వాణి, అనురాధ,శ్రీలత,సుజాత,హిమబిందు, కరుణ,తో పాటు అంగన్వాడి టీచర్లనుఅరెస్ట్ చేసి నాచారం పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ చర్యలు సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి తీవ్రంగా ఖండిస్తున్నాం. రేవంత్ రెడ్డి వెయ్యి రోజులు పరిపాలన సందర్భంగా అంగనవాడి వర్కర్లను ధర్నా చేయకుండా ఇంటి వద్ద అరెస్టు చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గడిలను పగలగొట్టిందని ప్రజాపాలనని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు పోరాటం చేసే వారి ఇంటి వద్దనే వద్దే పోలీసు తోటి గడిలను పెట్టారు. ఇదేనా 1000 రోజుల గొప్పతనమని ప్రశ్నించారు ఎన్నికల ముందు అంగనవాడి మధ్యాహ్న భోజనం వారికి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేని యెడల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పోరాటం చేస్తున్న కార్మికుల ఇంటి వద్దకు వచ్చిన గడిల పరిపాలన ఖండించండి..!!!

**- అంగన్వాడి ఆశా వర్కర్లకు ఎన్నికల హామీలను అమలు చేయాలి**

**- కే.ఉన్నికృష్ణన్ సహాయ కార్యదర్శి సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా**



కాప్రా/సెప్టెంబర్ 9( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : అంగనవాడి చలో అసెంబ్లీ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి సునీత కార్యదర్శి బి శోభారాణి కోశాధికారి ఈ శివరాణి తో పాటు అంగన్వాడి టీచర్లనుఅరెస్ట్ చేశారు. ఈ చర్యలు సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి తీవ్రంగా ఖండిస్తున్నాం. రేవంత్ రెడ్డి వెయ్యి రోజులు పరిపాలన సందర్భంగా అంగనవాడి ఆశా వర్కర్లను మున్సిపల్ కార్మికులను ధర్నా చేయకుండా ఎండి వద్ద అరెస్టు చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గడిలను పగలగొట్టిందని ప్రజాపాలనని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు పోరాటం చేసే వారి ఇంటి వద్దనే వద్దే పోలీసు తోటి గడిలను పెట్టారు. ఇదేనా వెయ్యి రోజుల గొప్పతనమని ప్రశ్నించారు ఎన్నికల ముందు ఆశ అంగనవాడి మధ్యాహ్న భోజనం వారికి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని హెచ్చరించారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 09,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, మజార్, ముజాహిద్ శ్రావణ్, అజార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో ఘనంగా మాజీ మంత్రి మల్లారెడ్డి జన్మదిన వేడుకలు

**- ప్రజా సేవలో మల్లారెడ్డి ప్రస్థానం స్ఫూర్తిదాయకం....**

**- మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్ బీఆర్ఎస్ నేతల ఘన సన్మానం**



బోడుప్పల్,సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర) : మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదిన వేడుకలు తిరుమలలో ఘనంగా జరిగాయి. బుధవారం జన్మదినం సందర్భంగా మాజీమంత్రి,బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి,మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి లతో పాటు బోడుప్పల్ నాయకులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మల్లారెడ్డి ప్రజా జీవితంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని, విద్య, రహదారులు, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజలతో నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం మల్లారెడ్డి ప్రత్యేకత అని అన్నారు.మల్లారెడ్డి ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో మరింత ఉత్సాహంగా ప్రజలకు సేవలందించాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, అవకాశం మల్లారెడ్డికి కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ,సీనియర్ నాయకులు కాటపల్లి రామచంద్రారెడ్డి,బందారం శ్రీధర్ గౌడ్,యువ నాయకులు మైసగళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**- ప్రజాకవి కాళోజీ స్ఫూర్తి చిరస్మరణీయం**

**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**




గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు (ఐపీఎస్) అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు అందించిన సేవలు మరువలేనివని అన్నారు. తెలంగాణ ప్రాంతంలోని ఎందరో కవులు, రచయితలకు కాళోజీ స్ఫూర్తిగా నిలిచారని, తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం, ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడని కొనియాడారు.ప్రజల భాషలో ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ, సమాజంలోని అన్యాయాలు, అసమానతలపై తన రచనల ద్వారా కాళోజీ గొంతెత్తారని ఎస్పీ పేర్కొన్నారు. భారతదేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మవిభూషణ్‌తో సత్కరించబడిన కాళోజీ ఆశయాలు, స్ఫూర్తి నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అదనపు ఎస్పీ కె. శంకర్ , డి.సి.ఆర్.బి. ఇన్‌స్పెక్టర్ టాటా బాబు, ఆర్.ఐ వెంకటేష్, నరేష్, కార్యాలయ సూపరింటెంట్స్ , సిబ్బంది, ఇతర విభాగాల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణం

**- ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో) : అన్యాయాన్ని ఎదిరించే ప్రతిధ్వనిగా, హక్కుల కోసం పోరాడిన ప్రజా మనిషిగా పేరుగాంచిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అధికారులు, సిబ్బందితో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల కష్టాలు, సామాజిక సమస్యలను తన రచనల్లో ప్రతిబింబిస్తూ కాళోజీ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన రచించిన 'నా గొడవ' సామాజిక సమస్యలపై ప్రశ్నించే ప్రశ్నాస్త్రంగా నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కాళోజీ కీలక పాత్ర పోషించి జీవితాంతం సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేశారని కలెక్టర్ తెలిపారు. అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని కాళోజీ జీవితం అందిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు కూడా విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ కాళోజీ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్‌రెడ్డి, ఏవో మంజుల, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల బుకింగ్, పంట నమోదుపై అవగాహన



ములుగు సెప్టెంబర్ 09 , విజన్ ఆంధ్ర ప్రతినిధి.: ములుగు మండల పత్తిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఎరువుల బుకింగ్, పంటల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ హరీష్ మాట్లాడుతూ ఎరువుల బుకింగ్‌కు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్ తర్వాత ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్‌లో ఆధార్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలని సూచించారు. వానకాలం పంటలను ప్రైవేట్ సర్వేయర్లు నమోదు చేస్తున్నందున వివరాలు అందించి కొనుగోలు సమయంలో ఇబ్బందులు తప్పించుకోవాలన్నారు.కార్యక్రమంలో టీఆర్వీకే జిల్లా కోఆర్డినేటర్ విశ్వతేజ, సర్పంచ్ ధరావత్ సరితా సారయ్య, ఉప సర్పంచ్ బద్రు, రైతులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు దశమంత్ రెడ్డి పరామర్శ, ఆర్థిక సహాయం అందజేత



అల్వాల్, సెప్టెంబర్ 9, (విజన్ ఆంధ్ర): అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురు కుటుంబాలను అల్వాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంత్ రెడ్డి పరామర్శించారు. మచ్చ బొల్లారంకు చెందిన పెయింటర్లు పోతులూరి ప్రభాకర్ (38), ఏ. సత్య నారాయణ కుటుంబాలను సోమవారం రాత్రి మృతి చెందారు. ప్రభాకర్‌కు భార్య, నలుగురు కుమార్తెలు, సత్యనారా యణకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరి ఆకస్మిక మృతితో కుటుం బాల్లో తీవ్ర విషాదం నెల కొంది. సమాచారం అందు కున్న అల్వాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశ మంత్ రెడ్డి మంగళవారం నాడు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటానని దశమంత్ రెడ్డి తెలిపారు.

## ఫేక్ మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- బీ.ఆర్.ఎస్. పార్టీ ఎమ్మెల్యేలు..!**

కా్రప్రా/సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : భారత రాష్ట్ర సమితి (బీ.ఆర్.ఎస్) పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా, వివిధ డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్ చేసిన తప్పుడు చిత్రాలు, ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఇమేజ్‌లు, దుష్ప్రచార కంటెంట్‌ను ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది.
ఈ మేరకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరపున ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి, తెలంగాణ డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్ ఐ.పి.ఎస్ కి ఫిర్యాదు అందజేశారు. 2 రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి, దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఉద్దేశపూర్వకంగా ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫేక్ (లేదా) ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడమే కాకుండా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది.

**సైబర్ ఫోరెన్సిక్ దర్యాప్తు చేయాలి**

ఫేక్, మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలు, పోస్టులను సైబర్ క్రైమ్ విభాగం వెంటనే గుర్తించి దర్యాప్తు చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కంటెంట్‌ను రూపొందించిన, అప్‌లోడ్ చేసిన, ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించాలని, సంబంధిత చిత్రాలపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత డిజిటల్ ఆధారాలు,



సోషల్ మీడియా అకౌంట్ వివరాలు, యు.ఆర్. ఎల్.లు, టైమ్‌స్టాంప్‌లు, మెటాడేటాను భద్రపరచాలని కోరారు. సైబర్ క్రైమ్, పరువునష్టం, తప్పుడు సమాచార ప్రచారం తదితర వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకుని ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది. రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేసి ప్రచారం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది.

**అసెంబ్లీ ఘటనపైనా చర్యలు తీసుకోవాలి**

అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై కూడా సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం కోరింది. సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేసింది. మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాతంగా, అత్యవసరంగా దర్యాప్తు నిర్వహించి, ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను రూపొందించి ప్రచారం చేసిన వారితో పాటు అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డీజీపీని కోరారు.

## వేములలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు

**- జడ్పీ ఉన్నత పాఠశాల, పల్లె దవాఖాన,**
**ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన**

**- పదో తరగతి విద్యార్థులు గణితంపై**
**పట్టు సాధించేలా నిరంతరం సాధన చేయాలి: కలెక్టర్**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర): మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా శాఖల ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

*విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి*

వేముల జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యాబోధన, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల వసతులు, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలను పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్‌తో పాటు విద్యార్థుల హాజరు, మార్కుల నమోదును తనిఖీ చేశారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు అందిస్తున్న అక్షయపాత్ర భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి సిలబస్ పూర్తయిన తీరు, పాఠ్యాంశాల పురోగతిని తెలుసుకున్నారు. గణితంలోని సూత్రాలు, సమస్యల పరిష్కారంపై విద్యార్థులను ప్రశ్నించి వారి అవగాహనను పరీక్షించారు. గణితంలో మంచి మార్కులు సాధించాలంటే సూత్రాలను గుర్తుపెట్టుకోవడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. సమస్యలను స్వయంగా పరిష్కరిస్తూ గణితంపై పూర్తి పట్టు సాధిస్తే ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

*విద్యార్థిని రచనపై అభినందన*

పాఠశాల విద్యార్థిని కుమారి మాధురి రచించిన 'శతక మధురిమ' పుస్తకాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పనితీరును ప్రశంసించారు. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన నేపథ్యంలో కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని ఫ్యాక్టరీల యాజమాన్యాల సహకారంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి అవసరమైన



కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.

*పల్లె దవాఖానలో వైద్య సేవల పరిశీలన*

అనంతరం పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడికి వచ్చే రోగుల సంఖ్య, సాధారణంగా నమోదవుతున్న అనారోగ్య సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అందిస్తున్న కాల్షియం మాత్రలు, ఇతర మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్ ప్రభుత్వ సేవల అమలు, గ్రామ పరిస్థితులు, పాఠశాల పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమర్థవంతంగా పనిచేస్తున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

*ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన*

వేముల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, మెనూ అమలు తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

*అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ అమలుపై ఆగ్రహం*

వేముల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా చిన్నారులకు అందిస్తున్న ఆహారం, మెనూ అమలును పరిశీలించారు. ఆ రోజు మెనూలో ఎగ్ బిర్యానీ ఉన్నప్పటికీ, బియ్యం వండి దానిపై గుడ్డు వేసి అందించినట్లు గుర్తించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేయకపోవడంపై సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్నారులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట మండల, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

## కాళోజీ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాకవి జయంతి వేడుకలు**


వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9 (విజన్ ఆంధ్ర) : ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (×ఱూజ)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్‌తో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం కాళోజీ తన రచనలు, ఉద్యమాల ద్వారా ప్రజల్లో గొప్ప చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. తన కావ్యాల ద్వారా సామాన్య ప్రజల సమస్యలను, వారి ఆకాంక్షలను సమాజం ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. కాళోజీ సాహిత్యం ప్రజల జీవితాలకు అద్దం



పట్టిందని, ఆయన రచనలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగించి, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని అధికారులకు సూచించారు. కాళోజీ చూపిన మార్గంలో సామాజిక చైతన్యం పెంపొందిస్తూ, ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో ఏవో భాను ప్రకాష్, డీపీఆర్ఓ సీతారాం, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సిరాజుద్దీన్, కార్మిక శాఖ అధికారి రవి, జిల్లా అధికారులు, ప్రజా సంఘాల నాయకుడు గంధం నాగరాజు, ప్రజాప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని మంచిర్యాల ఎమ్మెల్యే

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**



మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల ఎమ్మెల్యే 1000 రోజుల పాలన వైఫల్యాల పై బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఛార్జ్ షీట్ విడుదల చేసి పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు 1000 రోజుల పాలనలో పూర్తిగా విఫలం చెందారని అన్నారు. ఎన్నికల సమయంలో గెలిచిన 30 రోజుల్లో అండాలమ్మ కాలనీ డంపింగ్ యార్డు తరలిస్తామని, మూడు నెలల్లో ఎల్లంపల్లి బాధితులకు పెండింగ్ పరిహారం చెల్లిస్తామని, 6 నెల్లల్లో రాజీవ్ నగర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, ఎలాంటి కటింగ్ లేకుండా వడ్లు కొనుగోలు చేస్తామని వంటి అనేక హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మంచిర్యాల నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మంచిర్యాల - అంతర్గాం మధ్య 165 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం ప్రారంభం అయిన వంతెన రద్దు చేయించి ఆ నిధులను పక్కా దారి పట్టించారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎక్కడానికి పోయాయని ప్రశ్నించారు. 1000 రోజుల పాలనలో ఎమ్మెల్యే చేసింది ఏమైనా ఉందా అంటే గంజాయిని ప్రోత్సహించడం, గుండాయిజం, రౌడీయిజం, బెదిరింపులు వంటివి చేశారే తప్ప ప్రజలకు నయా పైసా ఉపయోగపడలేదు అని అన్నారు. ఎన్ని రోజులు గంజాయి బ్యాచ్ లను ప్రోత్సహించి ఇప్పుడు గంజాయి గురించి మీరా మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వేంపల్లి లో పారిశ్రామిక పార్క్ పేరిట పేదల భూములు దోచుకున్నారు తప్ప ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమ అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. ఈ 1000 రోజుల పాలనలో మంచిర్యాల ప్రజల సొమ్ము దోచుకుని 470 కోట్ల అప్పు కట్టి, కాంట్రాక్టర్ ల వద్ద నుండి కమీషన్లు దోచుకోవడం, భూ ఖబ్జాలు మరియు భూ సెటిల్మెంట్ లు చేసి డబ్బు సంపాదించడం తప్ప చేసింది ఏమి లేదు అని అన్నారు. 22ఖ లో మంచిర్యాల ప్రజల వేల నివాస భూములు మరియు లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉంటే ఎమ్మెల్యే ఒక్క గజం భూమి ఉన్న రాజీనామా చేస్తామనడం హాస్యపదం అని అన్నారు. మంచిర్యాల నియోజవర్గం ప్రజల పై ఎమ్మెల్యే కు చిత్తశుద్ధి ఉంటే 22ఏ జాబితా రద్దు చేయాలని లేని పక్షంలో ఇచ్చిన మాట ప్రకారం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, తుల ఆంజనేయులు, గోలి రాము, పట్టి వెంకట కృష్ణ, ఆకుల అశోక్ వర్ధన్, పచ్చ స్వప్న రాణి, దేగ బాపు, కస్తూరి నాగరాజు, రంగ శ్రీశైలం, కుర్రే చక్రవర్తి, కర్రె లచ్చన్న, రాకేష్ రెన్వ, జయరామరావు, నాంపల్లి శ్రీనివాస్, అవిడపు రాజబాబు, ముదాం మల్లేష్, బల్లపల్లి తిరుపతి, బద్రి శ్రీకాంత్, నల్ల రవి, ఆడెపు కుమార స్వామి, పవన్, రవీందర్, మహేందర్, నల్లపు రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ జీవితం నేటి. రేపటి తరానికి మార్గదర్శకం

**- ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**



కా్రప్రా/సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి నివాళులు అర్పించారు. తెలంగాణ సమాజం, ఉన్నంతవరకు .కాళోజీ చేసిన పోరాటం ఆయన జ్ఞాపకాలు పదిలంగా 10 కాలాలపాటు ఉంటుంది. కాళోజీ తన సాహిత్యం ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, పాలకుల వైఖరిని ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం రగిలించారని అన్నారు. "నా గొడవ" వంటి రచనల ద్వారా సామాన్యుడి గొంతుకగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కులు కాళోజీ జీవితాంతం పోరాడారని . ఆయన రచనల్లో తెలంగాణ ప్రజల జీవన విధానం, యాస, భాష, సంస్కృతి ప్రతిబింబించాయని అన్నారు. అప్పటి నిజాం నవాబు జైలు నాలుగు గోడల మధ్య బంధించిన. ప్రజా కవిత్వం మరింత పదునెక్కించాడని . ఓ నిజాం పిశాచి అని . కాలంబు రాగానే కాటేసి తీరాలని అన్నాడని గుర్తు చేశారు కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు దక్కిన అరుదైన గౌరవమని, తెలంగాణ భాష, యాస, సంస్కృతికి కాళోజీ చేసిన సేవలు ఎప్పటికీ తెలంగాణ ప్రజల హృదయాల్లో మెదులుతూనే ఉంటాయి. అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కొనియాడారు.

## ఆకట్టుకున్న "విష్ణు సమర్పణం" నృత్య వైభవం



హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ "శ్రీ క్లాసికల్ డాన్స్ ఇన్స్టిట్యూట్" ప్రతిష్టాత్మక సమర్పణలో "విష్ణు సమర్పణం" పేరిట శిష్యులచే ప్రదర్శించిన కూచిపూడి నృత్య వైభవం దివ్య సమర్పణ ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. అలరించింది. రవీంద్ర భారతి ప్రధాన ఆడిటోరియం, సైఫాబాద్, హైదరాబాద్ లో మంగళవారంనాడు ప్రముఖ నాట్య గురువులు పి. నిర్మల రాణి, ఎస్.శ్రీలక్ష్మి నేతృత్వంలో ఇన్స్టిట్యూట్లో కూచిపూడి నృత్యాన్ని నేర్చుకుంటున్న విద్యార్థులు ఎంతో కన్నుల పండుగగా చేసిన వివిధ నృత్యాంశాలు ప్రేక్షకులను సమ్మోహితులను చేశాయి. ఈ దివ్యమైన నృత్య వేడుకలో సుమారు వందమంది విద్యార్థులు నయనానందకరంగా ప్రదర్శించిన వివిధ నృత్యంశాలు, "కొలివేటి వారంగసాయి, కృష్ణం కలయ సఖి సుందరం, తిరుతిరి జవరాల, శ్రీకృష్ణ పాద పారిజాతం, అష్టలక్ష్మి స్తోత్రము, వెంకటేశ్వర కళ్యాణం, ముద్దుగారే యశోద, అన్నమయ్య కీర్తనలు, భక్త రామదాసు కీర్తనలు" ప్రేక్షకులను భక్తి పరవశ్యంలో, సంగీత సాగరంలో విహరింపజేశాయి. ఈ 'విష్ణు సమర్పణం' కూచిపూడి నృత్యాల సహకారానికి గుర్తింపుగా విద్యార్థులు అందరికీ ఒక దివ్య కానుకగా మొమెంటోలు, ప్రశంశా పత్రాలను గురువులు పి. నిర్మల రాణి, ఎస్.శ్రీలక్ష్మి అందజేసి అభినందించి, ప్రశంసించారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రముఖ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో చైతన్యం, స్ఫూర్తిని నింపడంలో కాళోజీ నారాయణరావు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ ఆశయాలు, స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, ఏ.ఓ. సువర్ణ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో రుద్ర హోమం మరియు చండీ హోమం



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 ( విజన్ ఆంధ్ర ) : దేవాదాయ ధర్మదాయ శాఖ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం కొత్తకొండ భీమదేవరపల్లి మండలం హనుమకొండ జిల్లా నందు రేపు అనగా 10 సెప్టెంబర్ 2026 గురువారం రోజున శ్రావణమాసం పురస్కరించుకొని రుద్రహోమము మరియు చండీ హోమం నిర్వహించబడును కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు అదేవిధంగా సాయంత్రము 5 గంటలకు శ్రీ స్వామివారి అమ్మవార్ల గ్రామ పర్యటన నిర్వహించబడును.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

**- త్వరలో జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు**

**- ఏఐ టెక్నాలజీ శిక్షణ ఇస్తాం**

**- TUWJ(IJU) రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ అలీ**



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 9(విజన్ ఆంధ్ర) : జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ`IJU) నిరంతరం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ అలీ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ మహా సభకు వెళ్తున్న మార్గ మాధ్యమంలో జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా నేతలు ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే జిల్లాలో జర్నలిస్టులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టెక్నాలజీపై జర్నలిస్టులకు సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా వార్తల సేకరణ, ఎడిటింగ్ మరియు వేగవంతంగా వార్తలను ప్రజలకు అందించడంలో జర్నలిస్టుల నైపుణ్యాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు, వారి వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే TUWJ ప్రధాన ధ్యేయమని వీరహత్ అలీ స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి వెంకటేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అబిద్, శ్రీకాంత్, శివ తదితరులున్నారు.

# కాళోజి సాహిత్యం ప్రజా జీవనానికి అద్దం



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 9(విజన్ఆంధ్ర) : ప్రజల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం కాళోజి చేసిన కృషి చిరస్మరణీయం: అదనపు కలెక్టర్ విక్టర్ కామారెడ్డి: ప్రజాకవి కాళోజి నారాయణరావు సాహిత్యం ప్రజల జీవన విధానానికి, ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టిందని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. కాళోజి ఆలోచనలు, రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విక్టర్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలకు బలమైన స్వరం అందించారని అన్నారు. తెలంగాణ సమాజంలో సామాజిక చైతన్యం, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. ప్రజల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం కాళోజి చేసిన పోరాటం, ఆయన సాహిత్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాళోజి రచనల్లో సామాన్య ప్రజల జీవితం, వారి సమస్యలు, ఆకాంక్షలు ప్రతిబింబించాయని అదనపు కలెక్టర్ తెలిపారు. సమాజంలో నెలకొన్న అసమానతలపై తన రచనల ద్వారా ప్రశ్నిస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగించిన మహనీయుడిగా కాళోజి నారాయణరావు నిలిచారని అన్నారు. ఆయన సాహిత్య స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు ప్రజల కోసం నిరంతరం గొంతెత్తిన ప్రజాకవిగా తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పాండు, డీఎంహెచ్ఓ వెంకటేష్, ఆర్డీఓ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, అసిస్టెంట్ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు సాపా శివరాములు, కొంగర వెంకటి, నాగభూషణం, ఎంబీసీ నాయకులు శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొని కాళోజి నారాయణరావుకు ఘనంగా నివాళులర్పించారు.

# అనఘాపురిలో సీసీ రోడ్ల పనుల పరిశీలన

**- నాణ్యతలో రాజీ వద్దు.. వేగంగా పూర్తి చేయాలి**

**- బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**



బోడుప్పల్,సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అనఘాపురి కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ జిల్లా బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,నాయకులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. అనగాపురి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగిస్తూ పనులు చేపట్టాలని, వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతినకుండా నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని కోరారు. కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్‌రెడ్డి,కంటెస్టెడ్ కార్పొరేటర్ రాపోలు ఉపేందర్, మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పుగల ప్రశాంత్, యువజన కాంగ్రెస్ నాయకులు అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# థలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సు



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (విజన్ ఆంధ్ర) : థలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కలెక్టరేట్, థలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ(టీఎస్‌సీఎస్) సంయుక్తంగా నిర్వహించినట్లు టీఎస్‌సీఎస్ చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్, సెక్రటరీ డా.సుమన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ రత్నావళి బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ముందస్తు స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ, నివారణ, సకాలంలో చికిత్సపై సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ డా.పద్మ అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే అక్టోబర్ 23-25 తేదీల్లో హెచ్ఐసీసీ నొవొటెల్‌లో జరగనున్న అంతర్జాతీయ గన్సిడ్ కాంగ్రెస్ కు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.శంకర్ తోపాటు వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఎల్‌టీలు, ఎంపీహెచ్ సిబ్బంది, ఏఎన్ఎంలతో కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు.

# సెంజట్రల్ మెడిసిన్ స్టోర్‌ను ఆకస్మికంగ తనిఖీ చేసిన డిఎంఎచ్ఓ. డాక్టర్. సంధ్యా కిరణ్మయి



గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని డిఎంఎచ్ఓ. డాక్టర్. సంధ్యా కిరణ్మ సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను ఆకస్మికంగ తనిఖీ చేశారు. ఈ సందర్భంగ మెడిసిన్ స్టోర్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మందుల నిల్వలు, వాటి భౌతిక స్థితి, రికార్డుల నిర్వహణ, మందుల ఇండెంట్, పంపిణీ ప్రక్రియను ఆమె క్షుణ్ణంగ పరిశీలించారు. తనిఖీలో భాగంగ స్టాక్ రిజిస్టర్లు, ఇండెంట్ రిజిస్టర్లు, మందుల పంపిణీకి సంబంధించిన రికార్డులు తదితరాలను పరిశీలించి, రికార్డుల్లో నమోదైన వివరాలకు, స్టోర్‌లో ఉన్న భౌతిక నిల్వలకు సరిపోలుతున్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. మందుల నిల్వలు, వినియోగం, పంపిణీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో సక్రమంగ నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే మందులు అవసరమైన ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , ఇతర ఆరోగ్య సంస్థలకు అవసరానికి అనుగుణంగ, నిర్ణీత విధానాల ప్రకారం మందుల సరఫర జరిగేల చూడాలని ఆదేశించారు. మందుల నిల్వలలో కొరత ఏర్పడకుండ ముందస్తు ప్రణాళికతో ఇండెంట్లు సిద్ధం చేసుకోవాలని, అత్యవసర మందుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్టోర్‌లో మందుల కాలపరిమితి , బ్యాచ్ నంబర్లు, నిల్వ విధానం తదితర అంశాలను కూడ పరిశీలించారు. కాలపరిమితి సమీపిస్తున్న మందులను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటి వినియోగం, పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మందుల నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రత, క్రమబద్ధమైన అమరిక, భద్రత ప్రమాణాలను తప్పనిసరిగ పాటించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, ఇతర ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మందులు సకాలంలో అందుబాటులో ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల మందుల నిల్వలు, పంపిణీ వ్యవస్థలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండ బాధ్యతాయుతంగ విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనరాణి, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ నరేందర్ బాబు ఉన్నారు.

# వైభవంగా నిర్వహించిన "బంగారు మైసమ్మ తల్లి" బోనాల జాతర



హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలంగాణ ఎన్జీవో సంఘం హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు, టి ఎన్ జి ఓస్ పాఠశాల విద్యాశాఖ హైదరాబాద్ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.డి. ఫకృద్దీన్ అహ్మద్ ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ తల్లి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎన్జీవో సంఘం కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్, కేంద్ర సంఘం సహాయ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, టి ఎన్ జి ఓస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కాలిద్, శంకర్, పబ్లిసిటీ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, జహంగీర్, వహీద్, రామకృష్ణ, మహమ్మద్, శ్రీకాంత్, ఎం.బి. కృష్ణ యాదవ్, టి ఎన్ జి ఓ సెంట్రల్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, చందు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మీయతకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు వాటి విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ ఎన్జీవో సంఘం నిరంతరం కృషి చేస్తూనే, ఉద్యోగుల మధ్య ఐక్యతను పెంపొందించేలా సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ముజీబ్ అన్నారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం అదనపు సంచాలకులు సత్యనారాయణ రెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సోమిరెడ్డి, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, అదనపు అధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల విద్యాశాఖ హైదరాబాద్ కార్యాలయ అదనపు అధికారి సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా అదనపు అధికారి పూర్ణచందర్, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఉన్నత న్యాయస్థాన ప్రభుత్వ న్యాయవాదులు, అదనపు ప్రభుత్వ న్యాయవాదులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో టి ఎన్ జి ఓ పాఠశాల విద్యాశాఖ కేంద్ర ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.డి. ఫకృద్దీన్ అహ్మద్, సీనియర్ నాయకులు ఎం.డి. ఉస్మాన్ పాషా, ఉపాధ్యక్షులు భాస్కర్, ఆర్. అశోక్, యుగేష్, రవి, జాయింట్ సెక్రటరీలు రమేష్, సుదర్శన్, జయంత్ రెడ్డి, ఠాకూర్, మొయిన్, పబ్లిసిటీ సెక్రటరీలు ఎం.వై. రవి, ఫెరోజ్ అహ్మద్, అరుణ జ్యోతి, ఆర్గనైజేషన్ సెక్రటరీలు కె. శ్రీనివాస్, శివ, ఎ. శేఖర్, కల్చరల్ సెక్రటరీ అఖిలుద్దీన్, ఈసీ మెంబర్లు యోగి, శివ తదితరులు సమన్వయం చేశారు. పాఠశాల విద్యాశాఖ ఫోరం సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని డా. ముజీబ్ ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఫోరం సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులందరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలి

**- కలెక్టర్‌కు వనపర్తి జిల్లా సర్పంచ్‌ల వినతి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9(విజన్ ఆంధ్ర) : గ్రామపంచాయతీల్లో ఉపసర్పంచ్‌లకు ఉన్న చెక్‌పవర్‌ను వెంటనే రద్దు చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పంచాయతీ నిధులను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని వనపర్తి జిల్లా సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా మెజిస్ట్రేట్‌ను కలిసి సర్పంచ్‌ల ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపసర్పంచ్‌లకు చెక్‌పవర్ ఉండటం వల్ల గ్రామాభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండే రాజకీయ పరిస్థితులు, విభేదాల కారణంగా ఉపసర్పంచ్‌లు కీలక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పనులను జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అనవసర ఘర్షణ వాతావరణం నెలకొనడమే కాకుండా, అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్‌లు ఈ పరిస్థితుల వల్ల నిశ్చేష్టస్థితిలో ఉండిపోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. అందువల్ల ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్‌ను వెంటనే రద్దు చేసి, బాధ్యతాయుతంగా వ్యవహరించే సర్పంచ్‌లకు మాత్రమే చెక్‌పవర్‌ను కొనసాగించాలని కోరారు. దీంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు అందితేనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగుతాయని వివరించారు. సర్పంచ్‌ల మనవిపై స్పందించిన కలెక్టర్, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**- నెల రోజుల్లో నూతన భవనాన్ని అందుబాటులోకి తేవాలి**

**- ఆహార నాణ్యతలో రాజీ పడొద్దు**

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని 30వ వార్డులో గల షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నూతనంగా నిర్మించిన వంటగది (కిచెన్), స్టోర్ రూమ్ భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

***నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి***

నూతన భవన నిర్మాణ పనుల నాణ్యతతో పాటు వినియోగిస్తున్న సామగ్రిని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను నిర్దేశించిన అంచనాల ప్రకారమే పూర్తి చేయాలని, అంచనాలకు మించి అదనపు పనులు చేపట్టరాదని తేల్చిచెప్పారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, మరో నెల రోజుల్లో పనులన్నీ పూర్తి చేసి భవనాన్ని విద్యార్థుల వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

***పరిశుభ్రత, పోషకాహారానికి ప్రాధాన్యం***

వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అందించే ఆహారంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, శుచిగా, నాణ్యమైన పోషకాలతో కూడిన భోజనాన్ని అందించాలని స్పష్టం చేశారు. వసతి గృహ ప్రాంగణం, వంటగది, భోజనశాల, మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతతో పాటు వారు చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణం కల్పించేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాంజీరావు, తహసిల్దార్ రమేష్ రెడ్డి మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# టీజీఈజేఏసీ ఛలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయండి..

**మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి.**



మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు,రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తలపెట్టిన ఛలో హైదరాబాద్ మహా ధర్నా ను జయప్రదం చేయాలని మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మంచిర్యాల జిల్లా నుంచి ఆఫీస్ సబార్డినేట్ స్థాయి ఉద్యోగి నుంచి మొదలుకొని జిల్లాస్థాయి అధికారుల వరకు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మంచిర్యాల జిల్లా సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ మహాధర్నా ప్రాధాన్యతను వివరిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్లు ఎదుర్కొంటున్న సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి ఈ మహాధర్నా అత్యంత కీలకమైన వేదిక. ప్రతి ఒక్క ఉద్యోగి తమ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా కో-చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ బొడ్డు శ్రావణ్ కుమార్, సెక్రటరీలు నడిమెట్ల సత్యనారాయణ, తంగళ్ళపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు

**- ఇండోర్ మైదానంను సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




గద్వాల సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గద్వాలలోని ఇండోర్ మైదానంను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియం పరిసరాలను, బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్, మార్షల్ ఆర్ట్స్, తదితర విభాగాలను పరిశీలించారు. స్టేడియం ప్రహరీ పై క్రీడలకు సంబంధించిన పెయింటింగ్స్ తో పాటు ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు, వారి వివరాలను పొందుపరచాలన్నారు. బ్యాడ్మింటన్ కోర్టులో సింథటిక్ మ్యాట్, లైటింగ్, పనులను చేయించాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్టేడియంలో ఫ్లడ్ లైట్స్ పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని, ఆయా పనులన్నింటిని సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, స్టేడియం ఇన్చార్జి బషీర్, విజయ్ తదితరులున్నారు.

# కాళోజీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

**కాళోజీ జీవితం యువతకు ఆదర్శం**

**- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కోర్ర సుమలత**



ములుగు సెప్టెంబర్ 09, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం ఆదర్శప్రాయమని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లికోర్ర సుమలతలి అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సుమలత మాట్లాడుతూ.. "నా గొడవ" లాంటి రచనల ద్వారా సమాజంలోని అసమానతలను, అన్యాయాలను నిర్భయంగా ప్రశ్నించి సామాన్యుడి గొంతుకగా కాళోజీ నిలిచారని కొనియాడారు. పదవులకు, ప్రలోభాలకు లొంగకుండా జీవితాంతం ప్రజా పక్షాన నిలబడ్డారన్నారు. కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని, యువత ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం



ములుగు సెప్టెంబర్ 09, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియలో ప్రతి అంశాన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎప్పటికప్పుడు వెల్లడించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో 109-ములుగు (ఎస్టీ) నియోజకవర్గానికి చెందిన అన్ని పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సవరణ షెడ్యూల్‌ను అక్టోబర్ 19 నుంచి నవంబర్ 9 వరకు పొడిగించిందని, సవరించిన షెడ్యూల్ ప్రతులను పార్టీలకు అందజేస్తున్నామన్నారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వచ్చిన దావాలు, అభ్యంతరాలకు సంబంధించి ఫారం-9, 10, 11 జాబితాలను, 308 పోలింగ్ కేంద్రాల వారీగా జారీ చేసిన నోటీసులు, వాటి పురోగతి వివరాలను ప్రతినిధులకు అందజేశారు. సవరణ ప్రక్రియపై ఎలాంటి సందేహాలు, సూచనలు ఉన్నా తెలపాలని కోరారు. ఈ సమావేశంలో ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని అధికారులు తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు.

**- అదనపు కలెక్టర్ మహేందర్ జి.**



ములుగు సెప్టెంబర్ 09 , విజన్ ఆంధ్ర ప్రతినిధి: సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతన కలెక్టరేట్ లో తొలిసారి జరుగుతున్న వేడుకలకు వేదిక, సీటింగ్, జాతీయ జెండా ఆవిష్కరణ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. తాగునీరు తదితర వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు వివిధ రాజకీయ పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు!

**- అంగన్వాడీల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి**

**- రూ.18 వేల వేతనం.. పీఎఫ్ సౌకర్యం వెంటనే అమలు చేయాలి**

**- పెండింగ్ బిల్లులు విడుదల చేయకుంటే పోరాటం ఉధృతం: సీఐటీయూ**




బాచుపల్లి, సెప్టెంబరు 9 (విజన్ ఆంధ్ర): అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ డిమాండ్ చేసింది. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిర్వహించిన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్‌ను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేయడాన్ని సీఐటీయూ నాయకులు పి.స్వామి, పి.భాస్కర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం పోరాడుతున్న అంగన్వాడీ ఉద్యోగులు, నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని వారు అన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

**రూ.18 వేల వేతనం ఇవ్వాలి**

ప్రీ, ప్రైమరీ, పీరంశ్రీ కేంద్రాలతో కలిపి మొత్తం 4,131 కేంద్రాలను తక్షణమే రద్దు చేసి వాటిని అంగన్వాడీలకు అప్పగించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఐసీడీఎస్‌కు నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలని కోరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల వేతనాన్ని వెంటనే అమలు చేసి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసింది.

**ఖాళీలను భర్తీ చేయాలి**

టీచర్లు, హెల్పర్లకు సంబంధించిన 15 వేల ఖాళీ పోస్టులను ఒకేసారి భర్తీ చేయాలని నాయకులు కోరారు. బీఎల్ఓ పెండింగ్ డబ్బులు, ఎస్ఐఆర్ డ్యూటీ అమౌంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

**పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్ల ఏరియర్స్, హెల్పర్ నుంచి టీచర్‌గా పదోన్నతి పొందిన వారికి రావాల్సిన పెండింగ్ ఏరియర్స్, పీఆర్సీ ఏరియర్స్, 24 రోజుల సమ్మె వేతనాలు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ నాయకులు స్పష్టం చేశారు.

## కలెక్టరేట్ లో ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు



నిజామాబాద్, సెప్టెంబర్ 09 :(విజన్ ఆంధ్ర )ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం (కలెక్టరేట్)లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ భుజంగరావు ముఖ్య అతిథిగా విచ్చేసారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీ నారాయణ రావు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని, కాళోజీ ఆలోచనా విధానాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సామాజిక సమస్యలపై కాళోజీ నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించేవారని అన్నారు. విద్యార్థి దశ నుండే నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడు కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమములో డీఆర్ఓ గీత, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


## నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు



నిజామాబాద్ సెప్టెంబర్09:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో పద్మవిభూషణ్, ప్రజాకవి డాక్టర్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఎంతో ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎన్ కృష్ణమోహన్ నాయకత్వం వహించగా, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ దినేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమాదేవి, పరిపాలనా సూపరింటెండెంట్ పెదోళ్ళ నాగరాజు, సుజాతతో పాటు పలువురు ముఖ్య బాధ్యులు హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సమాజానికి చేసిన సేవలను, తెలంగాణ భాషా సాహిత్యాలకు అందించిన అపారమైన కృషిని స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో కళాశాల వైద్యులు, బోధనా సిబ్బంది, ఇతర ఉద్యోగులతో పాటు పీజీ, యూజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారితో పాటు కళాశాల పరిసరాన్ని పరిశుభ్రంగా ఉంచే శానిటేషన్ సిబ్బంది, భద్రతా బాధ్యతలు నిర్వర్తించే సెక్యూరిటీ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై కాళోజికి నివాళులర్పించారు. కళాశాల యాజమాన్యం, వైద్య విద్యార్థులు, సమస్త సిబ్బంది ఒకే వేదికపైకి వచ్చి ఈ వేడుకను ఘనంగా నిర్వహించడం ద్వారా కాళోజి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కాళోజీ కలం.. తెలంగాణ చైతన్యానికి ప్రతీక

**- రచనలు, కవిత్వంతో ప్రజల్లో చైతన్యం నింపిన మహాకవి**



కాళోజీ ఆశయాలతో సమాజాభివృద్ధికి కృషి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్ రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రజాకవి శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనలు, కవిత్వం ద్వారా నాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై ఆయనకున్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస చారి, ఏడీ మైన్స్ క్రాంతికుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

# పేపర్‌బాయ్ నుంచి డాక్టరేట్ వరకు!

**- కూలీ కుటుంబంలో పుట్టి.. పేదరికాన్ని జయించి ఓయూ నుంచి పీహెచ్‌డీ**

**- పొద్దున్నే పేపర్లు.. పగలంతా కూలీ పనులు.. రాత్రిళ్లు చదువు**

**- లాఠీ దెబ్బలు.. కేసులు.. దాడులు.. అయినా ప్రజా ఉద్యమంలో వెనకడుగు లేదు**

**- దళిత, బహుజన హక్కుల కోసం పోరాటం.. రిజర్వేషన్లపై పరిశోధన**






తుంగతుర్తి, సెప్టెంబరు 9:( విజన్ ఆంధ్ర )
పేదరికం ఆయనను ఆపలేదు.. కష్టాలు ఆయనను కుంగదీయలేదు.. కూలీ పనులు, పేపర్‌బాయ్ జీవితం ఆయన లక్ష్యాన్ని మార్చలేదు. తెల్లవారుజామున పేపర్లు వేసి.. పగలంతా కూలీ పనులు చేస్తూ.. రాత్రిళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతూ ఉన్నత విద్యను కొనసాగించారు. మరోవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూ పోలీసుల లాఠీ దెబ్బలు, కేసులు, దాడులను ఎదుర్కొన్నారు. ఉద్యోగ అవకాశం వచ్చినా ప్రజా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పేదరికం నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం నేడు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకునే స్థాయికి చేరింది. ఆయనే తుంగతుర్తికి చెందిన డా. పాల్వాయి నగేష్.

**చదువులో చిన్ననాటి నుంచే ప్రతిభ**

పాల్వాయి ఎల్లయ్య, రమనర్సమ్మ దంపతుల కుమారుడైన నగేష్ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనబరిచారు. ఏడో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిభ చూపడంతో అప్పటి జిల్లా కలెక్టర్ మనోహర్ ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.ఆయన ప్రతిభను గుర్తించిన విద్యారణ్య పబ్లిక్ స్కూల్ యాజమాన్యం పదో తరగతి వరకు ఉచిత విద్య అందించింది.తర్వాత సూర్యాపేటలోని భవిత జూనియర్ కళాశాల యాజమాన్యం రెండేళ్లపాటు ఉచిత విద్యతో పాటు భోజన వసతి కల్పించింది. ఇంటర్ బైపీసీలో 85 శాతం మార్కులు సాధించారు.

**తండ్రి మరణంతో కుటుంబ బాధ్యత**

ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమయంలో తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ బాధ్యత మొత్తం నగేష్‌పై పడింది. ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారాయి. ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చినప్పటికీ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించే స్థోమత లేక కౌన్సెలింగ్ కేంద్రం నుంచే వెనుదిరగాల్సి వచ్చింది.అయినా లక్ష్యాన్ని వదల్లేదు.

**పొద్దున్నే పేపర్లు.. పగలంతా కూలీ**

కుటుంబాన్ని పోషించుకుంటూ చదువును కొనసాగించేందుకు తెల్లవారుజామున పేపర్‌బాయ్‌గా పనిచేశారు.భవన నిర్మాణ పనుల్లో మేస్త్రీగా, క్యాటరింగ్ పనుల్లోనూ పనిచేశారు.చెమటోడ్చి సంపాదించిన డబ్బుతో కుటుంబాన్ని నెట్టుకొస్తూనే పుస్తకాన్ని మాత్రం వదల్లేదు.

**ఓయూలో అడుగు.. ఉద్యమంలో దూకుడు**

ఉన్నత చదువుల కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి ఎంఏ సోషియాలజీ పూర్తి చేశారు.అక్కడే మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.మిలియన్ మార్చ్, సాగరహారం వంటి ఉద్యమాల్లో విద్యార్థులను సమీకరించారు. ఈ క్రమంలో పోలీసుల లాఠీ దెబ్బలు, కేసులను ఎదుర్కొన్నారు.

**ఉద్యోగం కంటే ఉద్యమమే మిన్న**

2012లో ఎస్ఐ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు.ఫిజికల్ ఈవెంట్స్‌కు ముందు ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట విద్యార్థి సాయికుమార్ ఆత్మబలిదానం చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.అనంతరం జరిగిన ర్యాలీలో పోలీసుల దాడిలో నగేష్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మరుసటి రోజు జరగాల్సిన ఫిజికల్ ఈవెంట్స్‌కు హాజరు కాలేక ఉద్యోగావకాశాన్ని కోల్పోయారు.అయితే దాన్ని జీవితంలో ఓటమిగా భావించలేదు. "ఉద్యోగం నా ఒక్క కుటుంబం కోసమే.. ఉద్యమం యావత్ తెలంగాణ ప్రజల కోసం" అనే ఆలోచనతో ప్రజా పోరాటానికే ప్రాధాన్యం ఇచ్చారు.

**ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా దళిత, బహుజన హక్కుల కోసం పోరాటం కొనసాగించారు. 2017లో మాదిగ నవనిర్మాణ సమితిని స్థాపించి పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు.
దళిత పరిశోధక విద్యార్థులకు రావాల్సిన ఫెలోషిప్‌ల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.ఇక తుంగతుర్తి నియోజకవర్గంలోనూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారు. 'దగాపడ్డ తుంగతుర్తి బిడ్డ తిరుగు యాత్ర' పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలను వెలుగులోకి తెచ్చారు. అమరుడు మారోజు వీరన్న స్తూపాన్ని రోడ్డు విస్తరణ పేరుతో తొలగించే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ ఆమరణ నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు.

**పోరాటం మధ్యలో పరిశోధన**

ప్రజా ఉద్యమాలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించిన నగేష్.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకున్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలో పీహెచ్‌డీలో చేరారు. 'భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ' అనే అంశంపై సుదీర్ఘంగా పరిశోధన చేసి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఆయన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది.

**స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా**

సెప్టెంబరు 8న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో డా. పాల్వాయి నగేష్ పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధుల చేతుల మీదుగా ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.కూలీ కుటుంబంలో పుట్టి.. పేపర్‌బాయ్‌గా పనిచేసి.. కష్టాల్లో చదువుకుని.. ప్రజా ఉద్యమాల్లో లాఠీ దెబ్బలు తిని.. కేసులు ఎదుర్కొని.. దళిత, బహుజన హక్కుల కోసం పోరాడి.. రిజర్వేషన్ల వ్యవస్థపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం నగేష్ ప్రస్థానంలో ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. కష్టాలు లక్ష్యానికి అడ్డుకావని.. పట్టుదల ఉంటే పేదరికాన్ని సైతం జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని డా. పాల్వాయి నగేష్ ప్రస్థానం నిరూపిస్తోంది.

**గతంలో సీజ్ - సీజ్**




**ఇప్పుడు ఓపెన్**




# మల్లంపేటలో అర్హత లేని వైద్యం?

**- అనుమతులు, వైద్య అర్హతలపై స్థానికుల అనుమానాలు**

**- గతంలో తనిఖీలు.. శ్వేత క్లినిక్‌పై సీజ్ చర్యలంటున్న స్థానికులు**

**- సీజ్ తర్వాత కూడా వెనుక వైపు నుంచి నిర్వహణ?**

**- పలు క్లినిక్‌లు, మెడికల్ షాపులపై సమగ్ర తనిఖీలకు డిమాండ్**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో డాక్టర్ కె. ఆనంద్**

దుండిగల్, సెప్టెంబర్ 9 (విజన్ ఆంధ్ర): మల్లంపేటలోని కొన్ని క్లినిక్‌లు, వైద్య కేంద్రాల నిర్వహణపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా కేంద్రాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? వైద్య సేవలు అందిస్తున్న వారి అర్హతలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? మందుల విక్రయానికి సంబంధిత లైసెన్సులు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

**సీజ్ చేసినా.. నిర్వహణ ఎలా?**




మల్లంపేటలోని శ్వేత క్లినిక్‌ను గతంలో అధికారులు సీజ్ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే సీజ్ చర్యల అనంతరం కూడా క్లినిక్ వెనుక వైపు నుంచి కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు తాజాగా వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన క్లినిక్‌లో ప్రస్తుతం వైద్య సేవలు కొనసాగుతున్నాయా? ఒకవేళ కొనసాగితే అందుకు అనుమతులు ఉన్నాయా? సీజ్ ఉత్తర్వులు అమల్లో ఉన్నాయా? అనే అంశాలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**పలు క్లినిక్‌లపైనా అనుమానాలు**

మల్లంపేటలోని తిరుమల క్లినిక్, పద్మా మెడికల్ అండ్ క్లినిక్, మల్లికార్జున క్లినిక్ తదితర కేంద్రాల నిర్వహణపైనా స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా క్లినిక్‌లకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? వైద్య సేవలు అందిస్తున్న వ్యక్తుల విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలు ఏమిటి? మెడికల్ షాపుల్లో మందుల విక్రయానికి అవసరమైన లైసెన్సులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. అయితే ఆయా క్లినిక్‌లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయనే ఆరోపణలు అధికారిక తనిఖీల్లో నిర్ధారణ కావాల్సి ఉంది.

**పర్యవేక్షణపై ప్రశ్నలు**

ఒకసారి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కారం కాదని, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన వైద్య కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో సీజ్ చర్యలు చేపట్టినట్లు చెబుతున్న క్లినిక్‌లు తిరిగి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్న ఆరోపణలు నిజమైతే వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**వాస్తవాలు నిగ్గు తేల్చాలి**

మల్లంపేటలోని క్లినిక్‌లు, వైద్య కేంద్రాలు, మెడికల్ షాపులపై సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా గతంలో సీజ్ చేసినట్లు చెబుతున్న శ్వేత క్లినిక్ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తోందా? నిర్వహిస్తే ఏ అనుమతుల ఆధారంగా కొనసాగుతోంది? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో ఆరోపణలను క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన ఉంటే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**డీఎంహెచ్‌వో ఆనంద్ వివరణ**

నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. మల్లంపేటలో గతంలో కొన్ని క్లినిక్‌లను సీజ్ చేసినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో, ఆయా క్లినిక్‌లకు సంబంధించి తమ కార్యాలయంలో ఉన్న రికార్డులు, పత్రాలను పరిశీలిస్తామని తెలిపారు. క్లినిక్‌ల నిర్వహణకు సంబంధించిన అనుమతులు, వైద్య సేవలు అందిస్తున్న వారి అర్హతలు, ఇతర నిబంధనలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడతారని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. తనిఖీల్లో సంబంధిత క్లినిక్‌లు అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు లేదా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గతంలో సీజ్ చేసినట్లు చెబుతున్న క్లినిక్‌లు ప్రస్తుతం తిరిగి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయా? వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను తనిఖీల అనంతరం పరిశీలిస్తామని డాక్టర్ కె .ఆనంద్ తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశాల్లో నిబంధనల ఉల్లంఘనను ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

## ట్రెసా రాష్ట్ర నూతన అధ్యక్షాకార్యదర్శులకు ఘనసన్మానం.

**-ర్యాలీతో ఘనస్వాగతం పలికిన రెవెన్యూ ఉద్యోగ సంఘాలు**



నిజామాబాద్ సెప్టెంబర్09:( విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా ) నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె. గౌతమ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎల్. రమణ్ రెడ్డిని నిజామాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు నూతన రాష్ట్ర నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.వారి నాయకత్వంలో ట్రెసా మరింత బలోపేతం కావడంతో పాటు రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా కృషి జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ట్రెసా నూతన అధ్యక్షులు కె. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ట్రెసా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రధానకార్యదర్శి ఎల్. రమణ్ రెడ్డి నిబద్ధతతో పనిచేసే నాయకుడని, ఉద్యోగుల సమస్యలపై ఓర్పుతో పోరాడే యువ నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. నూతన నాయకత్వంలో ఉద్యోగుల చిరకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని రెవెన్యూ ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఐక్యతను చాటుతూ ఉత్సాహభరిత వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బోధన్ డివిజన్, ఆర్మూర్, కలెక్టరేట్, జీపీఓ ల సంఘాల ప్రతినిధులు, అలాగే జిల్లాలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన రాష్ట్ర నాయకత్వానికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ట్రెసా కార్యదర్శి ప్రశాంత్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రావు, కోశాధికారి విజయ్ కాంత్ రావు, వైస్ ప్రెసిడెంట్లు భూపతి ప్రభు, వినయ్ సాగర్‌తో పాటు ట్రెసా సీనియర్ నాయకుడు, డిచ్ పల్లి తహసీల్దార్ సతీష్ రెడ్డి పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 112వ జయంతి సందర్భంగా ఘన నివాళులు సమర్పించిన జిల్లా అదనపు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు.

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 09 పోలీస్ కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు 112వ జయంతివేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పి గారు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపుఎస్పీమాట్లాడుతూ.తెలంగాణ భాషా సంస్కృతులకు, ప్రజా చైతన్యానికి కాళోజీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.అన్యాయాన్ని ఎదిరిస్తేనే నా గొడవ ఆగుతుంది" అని నినదించి, తన కలం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన యోధుడని పేర్కొన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ భాషా దినోత్సవం"గానిర్వహించడం ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవమని, నేటి తరం యువత, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు కాళోజీ గారి జీవితాన్ని, ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణయ్య, ఆర్ఐ జగన్, ఎస్ఐలు రమేష్,రామ్ లాల్, ఆర్ ఎస్ ఐ ప్రశాంత్,గౌస్ పాషా, శివాజీ జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.